ప్రజాశక్తి

Vol. 1, no. 6

(Jul. 22, 1942)

బెజవాడ, 1942

Record no. 683

Prajāśakti

Vol. 1, no. 6

(Jul. 22, 1942)

Bejavāḍa, 1942

Record no. 683

10 పేజీలు: 0-1-6 PRAJA SAKTI Regd. No. M. 4486.

చందావివరాలు	
సం॥ చందా	4-0-0
అర్ధసం॥ ,,	2-0-0
విడిప్రతి	0-1-6

ప్రజాశక్తి

అడ్వర్ టైజుమెంటు రేట్లు	
పూర్తిపేజి	35-0-0
అరపేజి	18-0-0
పావుపేజి	10-0-0
కాలం అంగుళం	0-12-0

రాజకీయ వారపత్రిక

సంపాదకుడు: కాట్రగడ్డ రాజగోపాలరావు. సంపాదకవర్గం: చలసాని వాసుదేవరావు, తుమ్మల వెంకటరామయ్య, కొండేపూడి లక్ష్మీనారాయణ

సంపుటి 1 | బుధవారం 22-7-42 బెజవాడ | సంచిక 6

విదేశాలనుండి ఇండియాలోకి రక్షణ నిమిత్తం మిత్రరాజ్యాల సైన్యాలు వచ్చుటచేతను దూరప్రాచ్య దేశాలనుండి కాందిశీకులు అనేకమంది వచ్చుచుండుటచేతనూ, వారందరికి వసతి సౌకర్యాలను ఏర్పరచడం ప్రభుత్వానికి సాధ్యమగుటలేదు. అందుచే ప్రభుత్వం ఇండియా డిఫెన్సు చట్టంక్రింద యింకో క్రొత్తరూలును ప్రకటించింది.

ఈ రూలు ననుసరించి ప్రజలను తమ ఇండ్లలో సైనికులు, సైన్యాధికారులు వగైరాలకు వసతిని ఏర్పరచి, ఆహార సరఫరాలను అందచేయాలని ప్రభుత్వం ఆజ్ఞాపించవచ్చును. అట్టి వసతులను ఏర్పరచిన ఆసాములకు అందులకయ్యే ఖర్చులను ప్రభుత్వం చెల్లించుతుంది. ఈ విధంగా వసతిసౌకర్యాలను ఏర్పరచాలని ప్రకటించబడినవారు, తమ యిబ్బందులను గురించి ప్రభుత్వానికి అప్పీలు చేసికోవచ్చును. అట్టి కంప్లెయింటులు సబబైనవని అనుకొంటే ప్రభుత్వం తమ ఆర్డరులను రద్దుగాని లేక సవరణగాని చేసికొంటుంది.

ప్రజలకు ప్రభుత్వాధికారులకు సన్నిహిత సంబంధం యిదివరకే వుంటే పై ఆర్డరును అమలు జరుపుటలో ఏమీ బాధవుండదు. కాని దురదృష్టవశాత్తు భారతదేశంవంటి బానిసదేశంలో ప్రభుత్వాధికారులు ప్రజలపై నిరంకుశంగా చలాయించడం పరిపాటి. వందల కొలదీ దబ్బు జీతం పుచ్చుకొనే పెద్ద వుద్యోగులు సైతము గ్రామాలవెంట క్యాంపులు వేసినపుడు స్థానిక ఉద్యోగులపై తమ ఖర్చులను రుద్దడం, వారు ప్రజలను, వర్తకులను బెదిరించి కఠినంగా పన్నులా అనునటుల అక్రమంగా వసూలుచేయుట యీ అభాగ్య దేశంలో అలవాటుగా వుంది. పెద్ద ఉద్యోగులు తాము క్యాంపులో వున్నందుకు ప్రభుత్వ బొక్కసాన్నుంచి బేటాలు తమ జేబులో వేసికొంటున్నా తమ ఖర్చులకు చెల్లించక, భుక్తికే చాలని క్రింది ఉద్యోగులను బాధించడం. వారు ప్రజలను సప్లయిలకొరకు వేధించడం నిత్యం జరుగుతున్న విషయాలు. సాధారణంగా రివెన్యూ ఇన్‌స్పెక్టరు, తహసిల్దార్, కలెక్టర్లు గ్రామమున్సబు కరణాలపై తమ క్యాంపుఖర్చులను రుద్దడం, స్కూల్ ఇన్‌స్పెక్టర్లు బడిపంతుళ్ళపై తమ ఖర్చుల బరువు మోపడం మన గ్రామాల పరిస్తితులను ఒక్కసారి పరికించినవారికి కూడ తెలిసిన సంగతే.

పైఆర్డరును అమలు జరుపడంలో అలాంటి అసహ్య కరమైన పరిస్తితులు కలుగకుండా ప్రభుత్వం జాగ్రత్త తీసికోవాలి. ప్రజలపై బలవంతంగా పైఆర్డరును రుద్దకూడదు. ఇచ్ఛకంగా అంగీకరించిన ప్రజల యిండ్లలోనే సైనికులను వుంచాలి. ప్రజలకు సైనికులకు మధ్య భారత దేశంలో యింకా సుహృద్భావం, సన్నిహిత సంబంధం ఏర్పడలేదు. అందుచే బహు జాగ్రత్తగా అమలు జరుప వలసివుంటుంది.

మన రాజకీయాలు

ఈసందర్భంలో ప్రజలుఒకసంగతి గుర్తించాలని కోరుతాము. ప్రభుత్వం ఎన్ని బూకరించినా సైన్యానికి కావలసిన వసతులు, ఆహార సరఫరాలు ప్రజల సహకారం లేనిదే చేయలేనని అంగీకరించిందన్నమాట. అంటే ప్రజా సహాయం లేనిదే కేవలం మిలిటరీ సాయంతో అమెరికన్ సాయంతో కూడా గెలువలేనని అంగీకరించిందన్న మాట. సైన్యాలకు వసతి నేర్పరచే యీ "బిల్లిటింగ్" పద్ధతి జయ ప్రదం కావాలంటే ప్రజలు సైన్యాన్ని తమ దేశరక్షకులుగా, తమ బంధు మిత్రులుగా చూడాలి. సైనికులు ప్రజలను తమ సోదరులుగా, తమ కుటుంబీకులా అన్నట్లుగా చూడాలి. అపుడే ప్రజలకు సైనికులకు మధ్య వున్న ఎడబాటు తొలగించడానికి వీలవుతుంది. ఒండొరుల ఎడ సుహృద్భావం ఏర్పడుతుంది.

అంటే సైనికులను తమ యిండ్లలో పెట్టుకొనమని నేడు మేము ప్రజలకు సూచించుటలేదు. కాని ఏగ్రామాలలో, ఏపట్టణాలలో, "బిల్లిటింగ్" ఎర్పాటు చేస్తారో అచట కొన్ని గృహాలు సైనికులకోసం ప్రత్యేకించాలి. వారికి కావలసిన ఆహార సరఫరాలు చేయడానికి ప్రజలే తగిన సౌకర్యాలు చెయ్యాలి. ప్రభుత్వం అందుకయ్యే ఖర్చులు భరించుకుంటుంది.

ఈ రకంగా ప్రభుత్వం బిల్లిటింగ్ ఆర్డరును అమలు జరిపితే ప్రజలకు సైన్యానికి ఘర్షణ రాదు. ప్రస్తుతం సైన్యమందు గల ద్వేషం, భయంపోయి, వారిని తమ దేశరక్షకులుగా భావించు కొంటారు. సహకారం చేస్తారు.

• • •

ప్రభుత్వం ప్రజల సహకారం ఏవిధంగా సంపాదించాలా అనే ఆలోచన లేకుండా ఒక వంక ఆర్డర్లను ప్యాసుచేస్తూంది, మరొక వంక కాంగ్రెసు నాయకులు అంధకారంలోకి దారి తీస్తున్నారు. మద్రాసు అసెంబ్లీ కాంగ్రెసు పార్టీ 15 వ తేది సమావేశమయింది. దాని తీర్మానం ప్రకారం మైనారిటీ వారికి తమదృక్పథం ప్రచారం చేసికొనే హక్కు నిరాకరించబడింది. తత్ఫలితంగా రాజాజీతో పాటు స్పీకరు సాంబమూర్తి, రామనాధన్‌రాజన్ వగైరా 10 మంది అసెంబ్లీ సభ్యులు రాజీనామాయిచ్చారు.

ఈ సందర్భంలో కాంగ్రెసు అసెంబ్లీ పార్టీ అవలంభించిన దృక్పథం సరియైనది కాదు. ఏమంటే కాంగ్రెసు వంటి దేశీయ ప్రజాసంస్థలో వివిధ రాజకీయ దృక్పథాలుగల వారుంటారు అట్టి వారికిభారత స్వాతంత్రోద్యమానికి వారిప్రచారం విరుద్ధం కానంత వరకు తమ దృక్పథాన్ని ప్రచారం చేసికొనే హక్కు వుండాలి. కాంగ్రెసు నిర్ణయించిన విధానాన్ని మార్పుచేయాలని ప్రచారం చేయడానికి, అఖిల భారత కాంగ్రెసు కమిటీలోనూ, రాష్ట్రకమిటీలోనూ, సభ్యుడుగావుండి కాంగ్రెసు నిర్ణయాలను విమర్శించడానికి హక్కుండాలి, దేశమంతటా ప్రచారంగావించి ప్రజాభిప్రాయాన్ని మార్చి ప్రజలను కాంగ్రెసులో చేర్పించి, కాంగ్రెసు నిర్ణయాలను మార్పించడానికి హక్కు వుండాలి. పైకమిటీ చేసిన తీర్మానాలను విమర్శించుతూ తీర్మానం చేయడానికి కూడ క్రింద కమిటీలకు హక్కు వుండాలి.

అసెంబ్లీ పార్టీ సభ్యులు శాసన సభలో మాత్రం కాంగ్రెసు నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటు చేయరాదు. కాని సభ్యులకు పార్టీనిర్ణయాలను విమర్శించడానికి వాటిని మార్పుచేయించడానికి ప్రచారం చేయడానికి హక్కు వుండాలి

పై హక్కుల కొరకు పోరాడటం సరియైనదే ఆవిధంగానే మనం కాంగ్రెసు ఆహక్కులను గుర్తించునట్లు చేయగలుగుతాము కాని రాజీనామా చేయడం మాత్రం సరియైనమార్గం కాదు. కాంగ్రెసులో చీలికలు తేవడం మాత్రమే అవుతుంది.

జాతీ యైక్యత కావాలని కోరుతు కాంగ్రెసు లీగులమధ్య ఐక్యతకొరకు కలిసి కృషిచేస్తున్న మనం కాంగ్రెసులోనే చీలికలు తేవడం సబబు కాదు. రాజీనామా యిచ్చినవారు ప్రస్తుత అసంతృప్తితో చీకాకుచెంది, కాంగ్రెసు బయట యింకో పార్టీని నిర్మించడం యింకా పరిస్థితులు విషమించునట్లు చేస్తుంది. అట్టి జాతీయ విచ్ఛేదక ప్రయత్నాలను కమ్యూనిస్టులు పూర్తిగా వ్యతిరేకించుతారు.

ఇదే సమయాన కాంగ్రెసు వర్కింగ్ కమిటీ, బ్రిటను అధికారం భారతీయుల హస్తగతం చేయనిచో సమిష్టిశాసనోల్లంఘంచేస్తానికి గాంధీజీని నాయకుడుగా ఎన్నుకుంటూ తీర్మానించింది, తీర్మానంలో చైనా వగైరా మిత్రమండలి రాజ్యాలకు పూర్తి సాయంచేయగలందులకు జపానుకు వ్యతిరేకంగా జయప్రదంగా పోరాడాలనీ స్వాతంత్ర్యం యివ్వాలని స్పష్టపరచింది. ఫాసిస్టులకు వ్యతిరేకంగా పోరాడాలన్న సంగతి గుర్తించినందులకు సంతసించవలసిందే కాని యివ్వనిచో సత్యాగ్రహం చేస్తామనడం మన దేశాన్ని అంధకారంలోకి లాక్కుపోవడమే అవుతుంది.

ఏమనగా నేటి పరిస్థితులలో సత్యాగ్రహం ద్వారా సంపూర్ణస్వాతంత్ర్యం సాధించబడదు. అది జపాన్ దుండగీదులకు ఆహ్వానంగా మాత్రమే పనికివస్తుంది.

అంతేగాక యీసారి కూడ వర్కింగ్ కమిటీ జాతీయైక్యత కొరకు ఎట్టి ప్రయత్నాన్ని చేయలేదు. ముస్లింలీగ్ ప్రభుత్వాన్ని ఏర్పరచినా సంతోషమే అనే ప్రకటన చేయడంలో అర్థంలేదు. అదే నిజమయినచో జాతీయ ఐక్యత కొరకు, జాతీయప్రభుత్వం ఏర్పరచటం విషయంలో ముస్లింలీగుతో సంప్రదింపులు ఎందుకు జరుపరు ?

దీనికి ఒకటే సమాధానముంది. కాంగ్రెసు నాయకత్వం ప్రస్తుతపరిస్థితులలో భారత స్వాతంత్ర్యానికి దారితీసే మార్గాన్ని తెలిసికోలేదు. అది కండ్లు మూసుకొని ఒక పొరపాటు నుండి మరొక పొర పాటుకు దిగజారుతూంది. సత్యాగ్రహాన్ని తలపెట్టి తాము ఎదిరించాలని ఒక వైపున చెబుతున్న ఫాసిస్టు దుండగీదులపని సులభం చేయడం అట్టి బోల్తాకు ముఖ్యచిహ్నం.

కాంగ్రెసు తీర్మానాన్ని బ్రిటీషు పత్రికలు తీవ్రంగా విమర్శించాయి. కాని అవి బ్రిటీషు సామ్రాజ్యవాదులు భారతదేశానికి గత 20 ఏళ్ళ ఫలితంగా చేసిన అన్యాయం ఫలితంగానూ నేటికి కూడ బ్రిటీషుప్రభుత్వం భారతజాతీయ వాంఛను నెరవేర్చకపోవడం ఫలితంగానూ ప్రజలలో వున్న అసంతృప్తిని గుర్తించుటలేదు. అందుచే సమస్యా పరిష్కారానికి తోడ్పడని విధాన, వినాశకరమైన విమర్శనలు చేస్తున్నాయి.

వాషింగ్‌టన్ పత్రిక టైమ్ వ్రాసినటుల రోమ్ తగులబడుతూ వున్నపుడు నీరో చక్రవర్తి ఫిడిల్ వాయించు తున్నట్లుగానే భారత దేశం యెడల బ్రిటీషు ప్రభుత్వ వైఖరి వుంది. అదేవిధంగా జాతీయ ప్రభుత్వం క్రింద కంటే తమకు బానిసగా వుంటేనే భారత దేశరక్షణ సులభమని బ్రిటిషు ప్రభుత్వమను కోడం కూడ పట్ట పగలు కలలు కనడం వంటిదే. ఏమంటే భారత ప్రజలు జాతీయ ప్రభుత్వం క్రిందనే జయ ప్రదంగా జాతీయ ప్రతిఘటన జరుపగలుగుతారు. అందుకొరకు బ్రిటీషు ప్రభుత్వం బ్రిటీషు కమ్యూనిష్టులు, ప్రజలు కోరుతున్నటుల భారతస్వాతంత్ర్యాన్ని గుర్తించి, జాతీయ ప్రభుత్వానికి అధికారం హస్తగతం చేయాలి. అప్పుడే ప్రజల సంపూర్ణ సహకారం లభ్యమవుతుంది. ఫాసిస్టు దుండ గీడులనుండి భారత దేశాన్ని రక్షించడం సులభమవుతుంది.

ప్రస్తుతం వున్న అవకాశాలలోనే యుద్ధ కృషిలో ప్రజాయుద్ధములో మనం పాల్గొనాలి. జాతీయైక్యత కొరకు పాటుబడాలి. తద్వారా బ్రిటీషు ప్రజలు తమ ప్రభుత్వంపై గావించుతున్న ఒత్తిడి జయ ప్రదమగునటుల మనం మనవంతు కర్తవ్యాన్ని నెరవేర్చాలి.

ప్రజాశక్తి

22-7-42 బుధవారం

వర్కింగ్ కమిటీ తీర్మానం

వార్ధాలో సమావేశమయిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ దీర్ఘ సమాలోచనలు జరిపి పొడుగాటి తీర్మానాన్ని ప్యాసుచేసింది. అది ప్రస్తుత స్థితి నుండి బయట పడటానికి దేశ ప్రజలకు సరియైన మార్గం చూపలేదు: అంధకారంలోకి దారి తీస్తోంది. దీనినిజూచి ఫాసిస్టు ముండగీడులు సంతసించుతారు. ప్రజలలోనూ, దేశ భక్తులలోనూ గందరగోళం కలుగుతుంది.

నేడు యావత్ప్రపంచము రెండు పక్షాలుగా విడిపోయి వుంది. ఒక వైపున ఫాసిస్టు సామ్రాజ్యవాదులు ప్రపంచ ప్రజలను బానిసలను గావించడానికి మారణ హోమం జరుపుతున్నారు. రెండోవైపున సోవియట్ యూనియన్, చైనాల నాయకత్వాన స్వాతంత్ర్యాన్ని కాంక్షించే ప్రపంచ ప్రజలందరూ పోరాడుతున్నారు. ఇప్పటి కప్పుడే కొందరు ప్రజలు ఫాసిస్టులచే బానిసలు గావించబడ్డారు. తక్కిన వారికికూడా అదే ప్రమాదం ఎదుర్కొంటూంది. అందుచే నేడు ఏదేశప్రజలూ యీ ప్రజాయుద్ధానికి దూరంగా నిలబడలేరు. ఏదో ఒక పక్షం వహించి తీరాలి. ప్రతి రాజకీయ సమస్య నేడు యుద్ధానికి ముడిపెట్టబడి వుంది: యుద్ధ వైఖరి ననుసరించే పరిష్కరించ వలసివుంది.

భారత స్వాతంత్ర్యం: భారత దేశ రక్షణ అనే సమస్య కూడ ప్రపంచ యుద్ధం యెడల అనుసరించే వైఖరినిబట్టియే పరిష్కరించ వీలవుతుంది. అనగా మనలను నేడు ఒకే ఒక ప్రశ్న సూటిగా ఎదుర్కొంటూంది. సోవియట్ యూనియన్, చీనాల నాయకత్వాన పోరాడుతున్న స్వాతంత్ర్య కాంక్షితులతో కలసి యుద్ధంలో పాల్గొని, జయించి మనం భారత స్వాతంత్ర్యాన్ని స్థాపించాలా? లేక ఫాసిస్టు సామ్రాజ్యవాదులు మనకు స్వాతంత్ర్య మిస్తారనే భ్రమతో నోరు తెరచుకు కూర్చోవాలా? ఈ ప్రశ్న చాల చీకాకు పరచేదిగా కన్పించేమాట నిజమే. కాని వర్కింగ్ కమిటీ తీర్మానాన్ని అర్థం చేసికోడానికి బాగా వినియోగపడుతుంది.

అయితే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం ఏమార్గం సూచించుతూంది? అది పరస్పర విరుద్ధమైన రెండు మార్గాలను, రెండు పాలసీలకు సమన్వయ పరచ డానికి ప్రయత్నించింది. పూర్తిగా విఫలమయింది.

వర్కింగు కమిటీ తీర్మానంలో యునైటెడ్ నేషన్సుతో భుజం, భుజం కలిపి దురాక్రమణదారులకు వ్యతిరేకంగా జాతీయ ప్రభుత్వం క్రింద పోరాడుతామని తెలుపబడింది. బ్రిటిషు ప్రభుత్వం అధికారాన్ని భారత ప్రజా ప్రతినిధుల హస్తగతం చేస్తేనే అలా జరుగుతుందని స్పష్టపరచబడింది. ప్రభుత్వం అందుకు అంగీకరించకపోతే, బ్రిటిషు పరిపాలన తనకుతానే వైదొలగకపోతే గాంధీజీ నాయకత్వాన 'దేశ వ్యాపిత పోరాటం' తెస్తామని బెదరించబడింది.

పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ గాంధీజీ తన చిత్తు తీర్మానంలోని ఘాటు తగ్గించి వేయబడిందని వాపోయాడు. అనగా అజాద్, నెహ్రూలు ప్రభుత్వం భారతీయులకు అధికారం అప్పగించి తొలగిపోతే భారత దేశ రక్షణకొరకు సాయుధ సైన్యాలతో యుద్ధం చేయడానికి సిద్ధంగా కాంగ్రెసు వుందనే మార్పును చేయించగలిగారన్నమాట. వెంటనే బ్రిటనుతో సంధి చేసికొని, యునైటెడ్ నేషన్సుతో సహకారం చేస్తూ దురాక్రమణను యెదిరించుతామనీ, చైనాకు సహాయం చేస్తామనే భాగాన్ని జేర్పించగలిగారన్నమాట.

ఆచరణలో యీ తీర్మానం యొక్క ఫలితమేమిటి? మార్పులు జరుగకపోతే తీర్మానం యింకా ఘోరంగా వుండేది. కాని ఇప్పుడైనా సంతృప్తికరంగా లేదనే చెప్పాలి. ఏమంటే గాంధీజీ తీర్మానాన్ని విశదపరచే ప్రకటనలో యిలా చెప్పాడు. "బ్రిటిషు పరిపాలన తొలగిపోవాలనే విషయాన్ని గురించి రాయబారాలకెట్టి అవకాశము లేదు. భారత స్వాతంత్ర్యాన్ని గుర్తించి తీరాలి; లేకపోతే లేదు." క్రిప్సు రాయబార సందర్భంలో యింతకన్న చిన్న కోర్కెలనే అంగీకరించక నిరాకరించిన నిరంకుశాధికారులు దీని నంగీకరించ రనుట స్పష్టమేగదా? ఇంగ్లండు దేశమంతటా జులై మొదటి వారంలో ప్రజలు సభలు జరిపి భారతదేశ రాజకీయ సమస్యను పరిష్కరించాలనీ, అందుకొరకు కాంగ్రెసుతో రాయబారాలు మళ్ళా ప్రారంభించాలనీ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు.

టైమ్సు వంటి కన్సర్వేటివ్ పత్రికకూడా యిలా వ్రాసింది. "ఏమైనప్పటికీ బ్రిటను చేయగలిగింది చేయబడుతుంది. ఈ దేశంలో భారత సమస్యను జయప్రదముగా పరిష్కరించి తీరాలనే అభిప్రాయం బలంగా వుంది." (15-7-42)

నిరంకుశాధికారులు రాజీకి దిగిరావటం లేదు. ఇంగ్లండులో అభివృద్ధి శక్తులు వారిని ఒత్తిడిచేసి వంచేవరకు చేతులు కదల్చకుండా వేచివుందామనే ధృక్పథంతో కాంగ్రెసు నాయకులు యింతవరదాకా కూర్చున్నారు. బ్రిటిషు పాలకవర్గం రాజీకి దిగి రాకపోతే అసంతృప్తి అనే సుడిగుండంలో పడి, దేశీయులందరిని అంధకారంలోకి దారి తీయడానికి నేడు సిద్ధపడుతున్నారు. వర్కింగు కమిటీ తీర్మానం ఆచరణలో యిచ్చే ఫలితమిదే. అందుచే అజాద్, నెహ్రూలు చేయగలిగిన సవరణలు ఆహ్వానింప దగినవే. అయినా అవి పైపై మెరుగులు మాత్రమే. గాంధీజీయే ఆచరణలో తన పంథాను నెగ్గించుకొనుటలో జయం పొందాడు. దీని ఫలితంగా క్రిప్సు రాయబారాలు విఫల మవడానికి కారకులయిన నిరంకుశాధికారులు "మేం చెప్పినట్లుగానే జరిగిం"దని చంకలెగుర వేస్తారు. పర్యవసాన మేమిటంటే, మొత్తంగా చూస్తే ఫాసిస్టు ప్రభుత్వాలకు యిది అన్ని విధాలా సంతసింపదగిన విషయము అవుతుంది.

పోరాటాన్ని గురించి మాట్లాడుతూ గాంధీజీ సాధ్యమైనంత విశాలమైన రూపంలో ప్రజాఉద్యమం వుంటుందనీ, దానిని సాధ్యమైనంత త్వరలో ముగించడం తన ఉద్దేశ్యమనీ చెప్పాడు. ఉద్యమం పూర్తిగా దౌర్జన్యరహితంగా వుంటుందనీ, అదే సమయాన బహిరంగ తిరుగుబాటుగా కూడా వుంటుందనీ సెలవిచ్చాడు. ఇంతకంటే అసంబద్ధమైన ఆశయం మరొకటి వుండబోదు. ఏమంటే ఇది నిరంకుశాధికారుల హస్తాలను బలపరచడానికి మాత్రమే ఉపయోగ పడుతుంది.

మరొక వైపున యీ తీర్మానం ప్రజలలో తీవ్రమైన గందరగోళం కలుగజేస్తుంది. జపాను అనుకూల వాతావరణాన్ని అరికట్టడానికి పూనుకోడం, తమ ఆశయమని తీర్మానంలో చెప్పబడింది. కాని ప్రారంభిపనున్న పోరాటం జపాన్ అనుకూలతను అరికట్టదు సరిగదా, హెచ్చు జేస్తుంది. జపాను రేడియో, తదితర ఫాసిస్టు రేడియోలకు భారతదేశంలో ప్రత్యక్ష తిరుగుబాటు జరుగుతోందని చెవులు దిబ్బళ్లు పడేలా ప్రచారం చేయడానికి అవకాశం దొరుకుతుంది. ఈ శాసనోల్లంఘనోద్యమం ఎట్టి సన్నాహాలూ లేకుండా, విరుద్ధమైన వాతావరణంలో జరుగుతోంది. కాబట్టి ప్రజలలో చీలికలు కలుగ జేస్తుంది. వారిలో నిరుత్సాహాన్ని వ్యాపింప జేస్తుంది.

మన దేశ ప్రజల యెదుట నేడు రెండే మార్గాలు వున్నాయి. మన దేశీయులను ఐక్యపరచి, ప్రజలనందరిని సమీకరించి జాతీయ ప్రభుత్వాన్ని సాధించాలి. అందుకోసం తక్కిన ప్రపంచ ప్రజలందరితో కలసి, ప్రజాయుద్ధంలో పాల్గొనాలి. తద్వారా మన స్వాతంత్ర్యాన్ని జయాన్ని సాధించాలి. ఇదే ప్రపంచ స్వాతంత్ర్యానికి విశ్వమానవ కళ్యాణానికి దారితీసే మార్గం.

లేకపోతే ప్రపంచ అభివృద్ధిని కోరే శక్తులనుండి మన ప్రజలను వేరు పరచిన వారమవుతాము. గాంధీజీ తేనున్న పోరాటం భారతదేశ స్వాతంత్ర్యానికి దారి తీయదు. దేశీయులలో చీలికలను మాత్రమే కలిగించుతుంది. దురాక్రమణ దారులకు వ్యతిరేకంగా జరిగే జాతీయ ప్రతిఘటనను భగ్నం చేస్తుంది. అనగా మన బానిసత్వ సంకెళ్ళను బలపరుస్తుంది. భవిష్యత్తులో యింకా పెద్దనష్టాలకు దారితీస్తుంది. అందుచే ఇది జపాను, జర్మనీ, ఫాసిస్టుముండగీడులను తప్ప మరెవరినీ సంతోషపరచదు.

కనుక కాంగ్రెసు వాదులు, భారత ప్రజలు కాంగ్రెసు వర్కింగు కమిటీ సూచించుతున్న యీ పాలసీని త్రోసివెయ్యాలి. మనం జాతీయ రక్షణకొరకు బ్రహ్మాండమైన సన్నాహాలు గావించాలి. జపాన్, జర్మన్ ఫాసిస్టు ముండగీడులకు వ్యతిరేకంగా జరిగే ప్రజా యుద్ధంలో మన సర్వస్వం ధారవోసి పోరాడాలి. తద్వారా ప్రపంచ స్వాతంత్ర్యాన్ని, భారత స్వాతంత్ర్యాన్ని సాధించాలి.

సవరణ

ది 24—6—42 తేదీ "ప్రజాశక్తి"లో మైనారిటీ సమస్యపై నున్న వ్యాసం (4 వ పేజీ, రెండవ కాలం, మూడవ పేరా) లో యీ క్రింది వాక్యాలున్నాయి.

"భారత ప్రజలు జపాను దాడిని యెదుర్కొడానికి ప్రయత్నాలు చేస్తున్నప్పుడు ప్రపంచ ప్రజలు, భారతీయులకు వెంటనే కాంగ్రెసు - లీగు ఐక్యత కుదిరినా కుదరకపోయినా జాతీయ ప్రభుత్వం యిచ్చేటట్లు ఒత్తిడి తెస్తారు. కాంగ్రెసు-లీగు ఐక్యత ముందు వచ్చేదీ, జాతీయ ప్రభుత్వం ముందు వచ్చేదీ ప్రపంచ పరిస్థితులను బట్టి ఉంటుంది."

దీనిని కొందరు పాఠకులు కాంగ్రెసు ప్రభుత్వమే జాతీయ ప్రభుత్వంగా పరిగణించ బడుతుందనీ, అట్టి కాంగ్రెసు ప్రభుత్వాన్ని నెలకొల్పడానికే బ్రిటిషు ప్రజలు తమ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తారనీ వ్యాసకర్త ఉద్దేశమని దురభిప్రాయ పడ్డారు. అంతేగాక కాంగ్రెసు-లీగు ఐక్యత కొరకు పాటుపడడం ముఖ్యావసరం కాదని కూడా అపోహపడ్డారు.

మా వ్యాసకర్త ఉద్దేశం అదికాదు. జాతీయ ప్రభుత్వం అంటే, బ్రిటీష్ ప్రభుత్వం అడ్డురాని స్వపరిపాలనాధికారంగల, కాంగ్రెస్-లీగు సంయుక్త ప్రభుత్వమని వ్యాసకర్త అభిప్రాయం. ముందు కాంగ్రెసు-లీగు ఐక్యత కుదరనిదే తామేమీ చేయలేమని బ్రిటిషు సామ్రాజ్యవాదులు చేసే బూటకపు ప్రచారాన్ని బ్రిటీష్ ప్రజలు ఎదిరించుతున్నారు. వారు తమ ప్రభుత్వంపై పూర్తి అధికారం భారతీయులపరం చేసేటట్లు ఒత్తిడి తెస్తున్నారు. కాంగ్రెసులీగు ఐక్యత ముందుగా మనం తీసుకురాగలిగితే బ్రిటీష్ ప్రభుత్వాన్నుంచి అధికారాన్ని తప్పనిసరిగా గుంజుకోగలుగుతాము. అలాగే బ్రిటీష్ ప్రజలు ముందుగా తమ ప్రభుత్వాన్ని లొంగదీసి, అధికారం భారతీయుల పరం చేయించగల్గితే వెంటనే కాంగ్రెస్-లీగు ఐక్యత తప్పక చేకూర్చగల్గుదుమని కమ్యూనిస్టుల నమ్మకం. అందుచేతనే ఏదిముందు అనే వివాదంలోకి వెళ్ళక మన కర్తవ్యమైన కాంగ్రెసు-లీగు ఐక్యతకోసం పనిచేస్తూ జపాను దాడిని ఎదుర్కొవాలని హెచ్చరించడమే ఆ వాక్యాల ఉద్దేశ్యం.

—సంపాదకుడు.

ప్రజాయుద్ధం

కామ్రేడ్ కంభంపాటి సత్యనారాయణ, ఎం. ఏ.,

(బొబ్బిలిపాట వరుస)

జయము జయము మన భారత భూమికి జయము దిగ్విజయము.
జయము జయము మన ప్రజా శక్తులకె జయము దిగ్విజయము

42. రష్యాలోను — రాక్షస హిట్లరు — రంగు మారిపోయె
జర్మను సేనలు — బిక్క మొగముతో — గిర్కున మరలాయి
॥భళాభళి॥

43. కిరాత హిట్లరు — క్రూర జపానుకు — కబురు పంపెనండీ
మిత్రమండలీ — ప్రాచ్యదేశములు — భస్మం చేయుటకు

44. జపానుకూడా — జాగుచేయక — జర్మను సలహాపై
పసిఫిక్ నందలి — మిత్రశక్తుల — దీవులపై బడియె
హవాయి దీవుల — హరించివేసెను
ఫిలిప్పైనులు — ఫైసలు చేసెను
జావా సుమత్రి — బోర్నియోలను
జపాను సేనలు — జయించెనండీ
మలయా దేశం — మంట గలిసెను
సింగపూరులో — సర్వ నాశనం

45. అంతటితోను — ఆగక జపాను — అటు బర్మాపైన
ప్రారంభించెను — మహా ఘోరమా — పోరాటంబపుడు

46. కాని దేశమని — జంగక గొంకక — చీనా సోదరులు
తమదు రక్తమును — మన దేశముకై — ధారవోసినారు

47. అయినాగానీ — ఆంగ్ల ప్రభుత్వం — అవసరమైనట్టీ
ప్రజల సహాయం — పొందకపోవుట — బర్మా ఓడింది.
॥జయము జయము॥

48. బర్మా ఓడగ — భారత భూమికి — భయము హెచ్చెనండి
ఏమి తోచక — గాభర పడుతూ — దిక్కులు చూస్తుంటే

49. జపానే మన జన్మ భూమిని — జయించి వేస్తేను
కిరాతరాజ్యం — కలకాలం మన — గతియే అగునండి

50. జపానులోనే — జనులందరు — జడియుచునుంటేను
భారత జాతికి — సంపదలిచ్చి — స్వరాజ్యమిస్తాదా?

51. తన ప్రజలే — తిండిలేకను — తికమక పడుతూంటే
భారతీయులు — బాధలనెన్నో — భరించవలె గాదా?

52. పరాయి ప్రభువగు — బ్రిటిషువాడిని — భరించలేమంటూ
మహామారుడగు — మరో క్రూరుడు — మన కెందులకండి
॥భళాభళి॥

53. జపాను దేశపు — ప్రజ లందరునూ — లోక శాంతికొరకు
ప్రయత్నించితే — ప్రజా నాయకుల — పగతో చంపించె

54. ఆకలిచేత — అన్నం అడిగిన — అనాధ లందరినీ
కరుణయె లేక — కాల్చివేసిరి — కలియుగ రాక్షసులు

55. ప్రజా హక్కులకు — పోరు సల్పిన — ప్రజా నాయకులను
దారుణ వధల — పాల్పడ చేసిరి — దేశ మన్నిచోట్ల
॥జయము జయము॥

56. చైనాయందు — చాలకాలముగ — చేసే క్రౌర్యాలు
వివరిస్తే ఆ — వివరాలన్నీ — వినగలేరు మీరు
పంటల నెన్నో — మంట గలిపిరి
గ్రామా లెన్నో — కాల్చివేసిరి
నగరా లెన్నో — నశింప జేసిరి
కర్మాగారాల్ — కూల్చివేసిరి
విద్యాలయముల — ధ్వంసం చేసిరి
రైతు లెందరిదొ — రక్తం పీల్చిరి
కూలీ లెందర — కూనీ చేసిరి
విద్యార్థులను — ధ్వసం జేసిరి
వయస్సు చెల్లిన — వారిని జంపిరి
స్త్రీలనుబట్టి — చెరచివేసిరి
పసిపాపలను — ప్రాణాల్ తీసిరి
దేశ ద్రోహులను — తయారు చేసిరి

★ కథ

'కొంటెపిల్ల'

ఒక 19 ఏళ్ళ కొంటెపిల్ల - అంటే, చేస్తానన్నపని చేసేదాకా నమ్మడానికివీలు లేనిపిల్ల - వచ్చి "నేను, రెడ్ఆర్మీ కావల్రీ (గుర్రపుదళం) లో చేరుతాను, నన్ను తీసుకోండి" అని అడిగితే మీరే మనుకుంటారు? ఏదో పిచ్చి ఆవేశంతో వచ్చిందను కుంటారు. అందులోను ఆధునిక పరికరాలతో యుద్ధం చేయవలసిన ఈ రోజుల్లో, యుద్ధరంగంలో ప్రథమ శ్రేణిలో నిలబడి యుద్ధం చేయాలంటే, కేవలం ధైర్యం వుంటేచాలదు. పట్టుదల కావలి. కష్టాలు ఓర్చుకోవాలి. అటువంటప్పుడు ఆడపిల్లలు ఏం చెయ్య గలుగుతారు? 'లూద్మిల్లా' వచ్చి ఒక రెడ్ఆర్మీ కావల్రీ దళాధిపతిని అడిగినప్పుడు అతడిలాగే భావించాడు. లేత వయస్సూ, కోమల శరీరంగల ఆడపిల్ల సైన్యంలోజేరి, అందు లోనూ గుర్రపు దళంలోచేరి ఏం చెయ్య గలుగుతుంది? పైగా సైన్యాల వెనుక ఆడవాళ్ళు చేయవలసిన సహాయం ఎంతోవుంది. అందుచేత లూద్మిల్లా కోరిక పదేపదే నిరాకరించబడుతూ వచ్చింది.

తన కోరిక నిరాకరింపబడి నప్పుడల్లా లూద్మిల్లాకి ఎక్కడలేని పౌరుషం వచ్చేది. పట్టుదలను సూచించేటట్లు, కంపించే పెదవులు బిగపట్టి, శిరఃకంపం చేసుకుంటూ వెళ్ళిపోయేది. కాని ఏం లాభం? ఈ కొంటెపిల్ల మాటలు రెడ్ ఆర్మీ వాళ్లెవరూ నమ్మడంలేదు. లూద్మిల్లాను ఆంబ్యులెన్సు దళంలో చేరమన్నారు. చివరకి ఎల్లాగై తేనేం, కష్టం మీద ఆంబ్యులెన్సు దళంలో చేరింది. అందులో ఈమెకు, సోల్జర్ల బట్టలుతికే పని యిచ్చారు. లూద్మిల్లా లాంటి పట్టుదలగల పిల్ల ఇష్టంలేని పని ఎల్లాచేయగలుగుతుంది? ఒకనాడు ఈఆంబ్యులెన్సు దళం వున్న గ్రామానికి రెడ్ఆర్మీ గుర్రపు దళంలో ఒక యూనిట్వచ్చింది లూద్మిల్లా పరుగెత్తుకు వెళ్ళింది. తనను దళంలో చేర్చుకోమని అడిగింది. కమాండరు ఈమెను చూచి నవ్వాడు. చేర్చుకోడానికి నిరాకరించాడు. రెండురోజులు పోయాక కమాండరు దగ్గరకు మళ్ళా తయారయింది. కమాండరు ఈ అమ్మాయిపట్టుదలకు ఆశ్చర్య పోయాడు. "ఇదేమిటి మళ్ళావచ్చావు?" అన్నాడు. లూద్మిల్లా కోపంతో "బాను వచ్చాను" అంది.

కమాండరు ఏమి మాట్లాడలేక పోయాడు. ఆమెను బుజ్జగించి అంతా బోధించాడు. "ఈ నాజీ తుపానులో నీవొక దూది పింజలాగ ఎగిరిపోతావు" అని చెప్పి పంపేశాడు. కాని ఒక గంట అయ్యాక "కామ్రేడ్ కమాండరు"అంటూ మళ్ళా ప్రత్యక్ష మయింది. "పోనీ నన్నొక స్కౌటుగా మీరెందుకు ఉపయోగించుకో కూడదు?" అని ప్రార్థించింది. ఈసారి కమాండరు ఆమె కోరికను నిరాకరించలేక పోయాడు.

స్కౌటుగా చేరినతరువాత లూద్మిల్లా తనప్లాను అంతా కమాండరుకు చెప్పింది. అతడామె తెలివి తేటలకి ఆశ్చర్య పోయాడు. ఆమె కళ్ళల్లోకి చూచాడు ఆపిల్లకళ్ళు మెరిసిపోతున్నాయి. చిరునవ్వుతో ఆమెకు అనుమతి నిచ్చాడు. లూద్మిల్లా, అచ్చమైన పల్లెటూరిపిల్ల వేషంవేసింది. పల్లెటూరి పిల్లలు తొడిగే జాకెట్టు, గొర్రెతోలు కోటు, కోటుమీద ఒక శాలువ చలికంతం కట్టింది. కాళ్ళకి పల్లెటూరి బూటు తొడిగింది. ఆవేషం దానికి తగినట్టు ఆపిల్ల పెట్టిన అమాయికపు పల్లెటూరి ఫోజు చూస్తే, ఆమెనెవరూ గుర్తుపట్టలేరు సరికదా, ఆమెలో నిబిడీకృతమైవున్నశక్తినికూడా గ్రహించలేరు. కమాండరు ముగ్ధుడైపోయాడు. ఆక్రమిత

(మిగతా 4 వ పేజీలో)

57. ఇన్ని యన్నియని — ఎన్నగలేని — ఎన్నో క్రౌర్యాలు
జరుపగలేదా — జపానువారు — చైనా దేశంలో
॥జయము జయము॥

58. జపానే మన — జన్మ భూమిని — జయించివేస్తేను
ఇంకా యెన్నో — ఇట్టి బాధలే — పొందవలసివచ్చు

59. జర్మని ఇటలీ — జపాను దాడిని — రూపుమాపుటయె
స్వాతంత్ర్యాన్ని — సంపాదించే — చక్కని మార్గంబు
॥భళాభళి॥

60. దుండగీడులొ — దోపిడిగాండ్రను — దుమ్మురేగగొట్టి
ఆలు బిడ్డలను — ఆస్థిపాస్తులను — ఆదుకొనగ రండీ

61. బలీయులైనా — ఫాసిస్టులను — భంగపరచగలము
ప్రపంచ మందలి — ప్రజలంతా మన — ప్రక్కనే వున్నారు

62. ఆంగ్ల ప్రజలు — అమెరికాయును — రష్యా చైన్యాలు
పాల్గొనుచున్నా — ప్రజా యుద్ధములొ — పోరును సల్పండి

63. పోరు సల్పితే — ప్రజా రాజ్యము — పొందవచ్చునండి
జయము జయము — మన భారత భూమికి — జయము దిగ్విజయము,

(అయిపోయింది)

ఆహార పదార్థాల ఉత్పత్తి : మద్రాసు ప్రభుత్వ ప్రకటనలు

కామేడ్ చలసాని వాసుదేవరావు

ఆహార దినుసుల పంటలను ప్రోత్సహించ డానికిగాను బంజరు భూములను సాగులోనికి గొనిరావడాన్ని గూర్చి కొన్ని సౌకర్యాలు కలుగచేస్తూ ఇటీవల మద్రాసు ప్రభుత్వం కొన్ని ప్రకటనలు గావించింది. తద్వారా పూర్తి సౌకర్యాలు కలుగకపోయినప్పటికిని, ఆ సౌకర్యాలు గమనార్హమైనవి. వాటి ననుసరించి రైతుకూలీ వర్కర్లు చేయాల్సినపని యెంతేని వున్నది. అందుచే వివిధ ప్రకటనలద్వారా గావించిన ప్రభుత్వ ప్రకటనల సారాంశమును రైతు కూలీవర్కర్ల వినియోగార్థం యీ క్రింద పొందుపరుచుచున్నాము.

బంజరుభూములలో ప్రభుత్వ బంజరు భూములు, జమిందారీ బంజరుభూములని రెండు రకాలు. ప్రభుత్వ బంజరుభూము లన్నిటికి పై ప్రభుత్వ ప్రకటనలలోని సౌకర్యాలు వర్తిస్తాయి. జమిందారీయేరియాల్లోని 'ఏ' రిజిష్టరు బంజరుభూములకు గూడవర్తిస్తాయి. తతిమ్మా జమిందారీ "బి" రిజిష్టరు బంజరు భూములకు వర్తించవు.

ప్రభుత్వ ప్రకటనలు :

(1) 1349, 1350 ఫసలీలో సాగుచెయ్య బడని పన్ను విధించ బడిన అనాక్రమిత భూములను, పన్ను విధించబడని లేక అడవులు కొట్ట బడిన అనాక్రమిత భూములను 1352, 1353, 1354 ఫసలీలలో పన్ను లేకుండా సాగు చేసు కుంటకై అనుమతి యివ్వవచ్చునని ప్రభుత్వం తెలుపుతోంది.

అయితే అట్టిభూములు ఒకేచోట ఏకఖండముగా (50 యెకరాలకు పైగా) ఉండకూడదు. ప్రస్తుతపు నిబంధనలకు అల్లాగ యివ్వడం వ్యతిరేకంగా వుండకూడదు. వాటిమీద ఆహార దినుసులను మాత్రమే పండించాలి.

1354 వ ఫసలీ పూర్తి అయిన తరువాత గూడ ఆభూములనుండి తొలగించ కుండా యేర్పాటు చేయడానికి ప్రభుత్వం అంగీకరించింది. మొదటి ప్రకటనల్లో మూడు సంవత్సరాలకే సాగు చేసుకొనే హక్కు యివ్వబడింది ఇప్పుడు ఆ కాలాన్ని 5 సంవత్సరాల వరకూ పెంచినది. శాశ్వతంగా పంటపండించు కోవచ్చు ననే గ్యారంటీవుంటే వ్యవసాయ దారుడు హెచ్చుపెట్టుబడి పెట్టి, హెచ్చు శ్రద్ధ చూపెట్టుతాడు. అందుచేత శాశ్వతంగా పండించుకునే హక్కు యివ్వవలసిన అవసరముంది. కనీసం 10 సంవత్సరాలకైనా సాగుహక్కు కాలాన్ని పొడిగించాలి.

(2) కృష్ణా, గోదావరి డెల్టాలలో యిది వరకు సాగులోలేని ఆయకట్టు క్రింది బంజరు భూములను ఇన్‌క్లూజన్ ఫీజ్ (నజరానా) లేకుండా సాగుకు యివ్వవచ్చును. ఈ భూములు 1352 వ ఫసలీ అంటే యీ సంవత్సరమే సాగులోనికి వచ్చే బంజరు భూములకు మాత్రమే దరఖాస్తులు చేస్తే ఇన్‌క్లూజన్ ఫీజు లేనివేయబడుతుంది. ఈ దరఖాస్తులు కలెక్టరుకు పెట్టుకోవాలి.

పైబంజరు భూములన్నిటిని తహస్సీల్ దారుకు దరఖాస్తు చేస్తూ అకాపీనే జిల్లాకలెక్టరుకుకూడ పంపాలి.

ఒకేచోట ఏకఖండముగా వున్న భూములను ప్రస్తుత నిబంధనలు అడ్డువస్తే ఇప్పుడు సాగుకయివ్వరాదని ప్రకటనలో వుంది. అవిధంగా నిజమైన ఏక ఖండాలను లేబరు కాలనీలకొరకు పెట్టే నిమిత్తం రిజర్వుచేసివుంచారు. కానిఆస్కీము యింతవరకూ అమలు జరుగలేదు. అంత వరకూ వాటిని సాగుకు యివ్వకుండా నిబంధనలడ్డు వస్తాయనే కారణంతో అట్టిపెట్టుట అనవసరం తాత్కాలికంగా ఏసేట సాగుకు గాని రావచ్చు. అందుకుగాను అట్టిఏకఖండాలలోగూడ వ్యవసాయ కూలీలకు తాత్కాలికంగా నైనా సాగుకు యివ్వడానికి ఆందోళన గావించాలి.

రైల్వే పోరంబోకలు :

రైల్వే పోరంబోకలను తమకు నష్టం రాకుండా వుండనంతవరకు సాగుకు యివ్వడానికి గాను రైల్వే అధికారులు అంగీకరించారు. పెద్దపెద్ద పోరంబోకులుగా వున్న బంజరు లన్నింటిని 1352 వ ఫసలీ నుండి మూడు సంవత్సరాల వరకూ సాగుకు యిస్తారు. ఈ విషయంలో శిస్తులేకుండా, గాకండా కంట్రోక్టు పద్ధతిపైన యిస్తారు. ఆ ప్రాంతాల రెవిన్యూ అధికారులకు (రెవిన్యూ ఇన్‌స్పెక్టరు, తహసీల్‌దారు) దరఖాస్తు చేసుకోవాలి.

నీటికై దరఖాస్తులు :

యుక్తమైన కాలంలో సాగు నీటికై పర్మిషన్ కొరకు దరఖాస్తు పెట్టలేదన్నంతమాత్రాన ఆహార దినుసులను యీ సంవత్సరంలో పండించేవారికి పెనాల్టీలు విధించరాదని ప్రభుత్వం వుత్తర్వుజేసింది. చివరవరకూ నీరుసప్లయి చేయగలుగుతుందని యేమీ ప్రభుత్వం హామీ పడుటలేదు. మురుగుకాలువలు, కోస్సు వగైరా నీటివనరుల నుండి పంపులతో గాని, ఏతాములతోగాని తోడుకొని సాగు చేసుకునేటప్పుడు యీ సౌకర్యము వర్తించదు. కాన అట్టివాటికి దరఖాస్తు చేసితీరాలి. పై సందర్భములో గూడ యీ సంవత్సరమునకు మాత్రమే యీ సౌకర్యం వర్తించుతుంది. అందుచేత సాధ్యమైనంతవరకు నీటి దరఖాస్తులు అన్ని సందర్భములలోను చేసి పర్మిట్‌లు పొందడమే మంచిది. అగస్టు నెల 15 వ తేదీతో సాగు పూర్తిగా బడుతుంది గాన జులై ఆఖరులోపల సాగు నీటిపర్మిట్‌లు పొందాలి. ఈ దరఖాస్తులు ఓవర్‌సీయర్ల దగ్గర దాఖలుచేయాలి.

ప్రభుత్వపు అప్పులు :

1351 వ ఫసలీలో సాగు కాకుండా పడి వుండి, 1352 వ ఫసలీలో ప్రభుత్వ పెట్టుబడి సహాయము లేనిదే సాగు చేయబడజాలని బంజరుభూములకు ప్రభుత్వం అప్పులు యివ్వ డానికి అంగీకరించినది.

వల్లపుభూమికి యెకరానికి 10 రూపాయలు మెట్టభూమికి 5 రూపాయలకు మించకుండా అప్పు లివ్వబడుతాయి. మొత్తం అప్పు ఆ భూమికికట్టేమొత్తపు శిస్తుకంటే 5 రెట్లకన్నా అధికంగా వుండరాదు. ఈ అప్పు రెండు సాంవత్సరిక వాయిదాలతో తీర్చుకోవాలి. మొదటి పంట చేతికొచ్చిన తదుపరి మొదటివాయిదా చెల్లించాలి. మొదటిపంట పూర్తిగా పోతే రెండో పంటవరకు మొదటివాయిదా పొడిగించబడుతుంది. ఏ పరిస్థితుల్లోనూ అప్పు యిచ్చిన లగాయతు 30 మాసాలలో పూర్తిగా చెల్లించి వేయాలి. వాటికి గూడ రెవిన్యూ అధికారులకే దరఖాస్తు చేసుకోవాలి. గవర్నమెంటు గ్రామాల్లోని బంజరుభూములను సాగుచేసేవారికే గాక జమిందారీ యేరియాలలో బంజరుభూములను సాగుచేసేవార్కి గూడ యిట్టి అప్పు లివ్వబడుతాయి.

ప్రభుత్వ ఖాళీ ఆవరణాలు :

కూరగాయలు మొదలుగా గల ఆహార పదార్థాలను పండించు కోవడానికి యుద్ధకాలంలో చర్చీలు, స్కూల్సు, ఆస్పత్రులు మొదలైన వాటివాటి ఆవరణలలో పండించడానికి అనుమతి యివ్వవచ్చని ప్రభుత్వం కలెక్టర్లకు అధికారం యిచ్చారు. అట్టిభూములు యిదివరకు పన్ను విధించ బడనివిగా వుండాలి. విధించినా యిప్పుడు రద్దుచేసి అయినా వుండాలి. అట్టి భూములకు పన్ను యేమీ పుచ్చుకోరు నీరు పెట్టు కుంటే మాత్రం నీటి పన్ను కట్టాలి. నీరు పెట్టు కోవడానికి పర్మిషన్ గూడా వుండాలి.

నీటిసాగుకు గూడ తహశీల్ దారు ద్వారా కలెక్టరుకే దరఖాస్తు చేసు కోవాలి.

జమిందారీ యేరియాలోని బంజరుభూములు :

జమిందారీ యేరియాలోని "ఏ" రిజిష్టరు బంజర్లకు పై నియమాలన్నీ వర్తించుతాయి. ప్రభుత్వమునకే నేరుగా దరఖాస్తులు చేసుకోవచ్చును. జమిందారీ "బి" రిజిష్టరు బంజరు భూములకు యీ నియమాలు వర్తించవు. అయినప్పటికీ వాటికి గూడ దరఖాస్తులు చేయాలి. ముఖ్యంగా జమిందారుకు దరఖాస్తు చేస్తూ అప్రతే కలెక్టరుకు గూడ పంపాలి. తప్పక ప్రభుత్వము చేత యిట్టి జమిందారీ బంజరు భూములను గూడ వ్యవసాయకూలీలకు పేదరైతులకు యిప్పించవచ్చును.

గవర్నమెంటు బంజరు పైనా, జమిందారీ బంజరు పైనా, అన్నిటికి గూడ దరఖాస్తులు చేయాలి. వల్లపు భూములైన నీటి దరఖాస్తులు గూడ పెట్టాలి. ఇవి భూములను సాగుచేయబోయేముందు తప్పక చేయాలి.

కొంటె పిల్ల

(3 వ పేజీ తరువాయి)

ప్రాంతంలోకి - నాజీ శ్రేణులవెనుకకి. అపిల్ల ప్రయాణమై పోయింది. ఆమె గమ్యస్థానం ఆక్రమితప్రాంతంలోని నాజీ మిలిటరీ కేంద్రం

ఆమె అనేక విషాద దృశ్యాలను దాటి వెళ్ళవలసి వచ్చింది. నాజీరాక్షసులచే తగులబెట్టబడిన గ్రామాలు నిలువునా ప్రాణాలు తీయబడిన వారి శవాలు, వికలాంగులై పడివున్న జీవన్మృతులు, అనేకం ఆమె దాటవలసి వచ్చింది. ఒక గ్రామంలో ఆమె కొక పిచ్చి యువతి కనబడింది. ఆవిడను జర్మను సైనికులు మానభంగం చేశారు. దానితో ఆవిడకు పిచ్చి ఎత్తింది. తన ముఖంముందర ఏదో అర్థంవున్నట్లు మాటిమాటికి చేత్తో దులుపుకుంటూ వుంటుంది. బాధకరమైన మూలుగులాగ తనలో తానేమేమో గొణుగుకుంటూ వుంటుంది. లూద్‌మిల్లా ఆమె దగ్గరకు పోయి పలకరించబోయింది. కాని ఆమెకీప్రపంచంతో సంబంధంలేదు.

మరికొంత దూరం పోయేసరికి చనిపోయిన తాతకోసం ఏడుస్తున్న ఒక 10- 12 ఏళ్ళ కుర్రాడు కనిపించాడు. లూద్‌మిల్లా తాతకూడ నాజీలకు బలి అయినవాడే. అందుచేత ఇద్దరికి స్నేహం కుదిరింది? ఈమెతో రావడానికి వాడు అంగీకరించాడు. ఇద్దరూకలసి ప్రయాణం సాగించారు. దారిపొడుగునా వాడికి ధైర్యం చెబుతూ తీసుకు పోయింది.

సాయంకాలమయ్యేసరికి ఒక పల్లెటూరు చేరుకున్నారు. ఒకరైతు యింటికి వెళ్ళి తలుపు తట్టారు. ఒక సన్నని పొడుగాటి ముసలమ్మ తలుపు తెరిచింది. వీళ్ళిద్దరు లోపల ప్రవేశించారు. ముసలమ్మ ఆదరించి లోపలకు తీసుకుపోయింది. లోపల కొందరు జర్మను సోల్జర్లు ఒకటేబిలు చుట్టూచేరి గోలచేస్తున్నారు. వాళ్ళని చూచేసరికి లూద్‌మిల్లాకు పరమ అసహ్యం వేసింది. నాజీలు ఎంతో పరిశుభ్రంగా వుంటారని పుస్తకాల్లో వ్రాసుకుంటారు. కాని వాళ్ళకంటె పందులునయం. మురికి చేతుల కడుక్కోనైనా కడుక్కోరు. అలాగే తినేస్తారు. లూద్‌మిల్లా లోపలికి వెళ్ళగానే అందులో ఒక వెధవ ఆమెను ఆపాద మస్తకం పరీక్షగా చూచాడు. వాడికళ్ళు ఈ పిల్ల తొడిగిన చెప్పులమీద పడ్డాయి అమాంతంగా వచ్చి లూద్‌మిల్లాను క్రింద పడవేసి ఆ చెప్పులు విప్పుకు పోయాడు. లూద్‌మిల్లాకు వాడిని చంపి వెయ్యాలన్నంత కోపం వచ్చింది. కాని రైతుమునలమ్మ అడ్డువచ్చి "రేపు నీకింకో కొత్తజోడు యిస్తానులే అమ్మా అని ఓదార్చింది.


లూద్‌మిల్లాతోవచ్చిన కుర్రాడు బాగాఅలిసి వుండడం చేత వెంటనే నిద్రపోయాడు. లూద్‌మిల్లాకుమాత్రం నిద్రపట్టలేదు. ముసలమ్మవల్ల తనకు కావలసిన ఆచూకీఅంతా తీసుకుంది. చీకటితోనే లేచింది. ఆ నాజీ పందులు ఇంకా గుర్రుకొట్టి నిద్రపోతూనే వున్నారు. కుర్రాణ్ణి లేపింది. ముసలమ్మ ఇస్తానని వాగ్దానం చేసిన చెప్పులు, చద్ది అన్నపుమూట యిచ్చి సాగనంపింది.

తాను తెలుసుకున్న రహస్యాలు తన కమాండరుకు వెంటనే తెలియ జేయాలన్న తత్తృత ఆమెను పరుగులెత్తించింది. అడవులూ, కొండలు ఆమె కొక అడ్డంకిగా తోచలేదు. కుర్రాడు కూడ హుషారుగానే నడిచాడు.

లూద్‌మిల్లా తెచ్చిన రహస్యాలు వాళ్ళ గుర్రపు దళానికి చాలా ఉపయోగపడ్డాయి. రెడ్ సైనికులీ బాలయోధులకి బ్రహ్మరథం పట్టారు.

అప్పటినుంచీ లూద్‌మిల్లా ఆగుర్రపు దళంలో ఒక ముఖ్యురాలై పోయింది. ఆమె కదే ఉద్యోగంయిచ్చారు. రష్యన్ పిల్లల కొంటెతనం అంటే అది.

(ఈ వాస్తవిక గాథ మాస్కో న్యూస్ నుండి)



ది 25-6-1942 వ తేదీని ఆంధ్రప్రభలో పశ్చిమ గోదావరిజిల్లా రైతు సంఘము 2 సంవత్సరములనుండి పని చేయుటలేదని అందువలన ఆర్గనైజింగు కమిటీగా శ్రీ సామవేదం సత్యనారాయణ గారు (అధ్యక్షులు) గాను గొట్టుముక్కల వెంకన్న, కొమ్మారెడ్డి సూర్యనారాయణ గార్లను ఉపాధ్యక్షులుగాను, ఆత్కూరి అమ్మిరాజుగారిని ప్రధాన కార్యదర్శిగాను మేకల రంగయ్య, మద్దాల బాలాజీ గార్లను సహాయ కార్యదర్శులుగను ప్రకటించిరి. ఇది మాకు చాల ఆశ్చర్యము కలిగించెను. రాష్ట్ర సంఘమువారు వాస్తవపరిస్థితులను తెలిసికొనుటకై యీ క్రింది విషయములు తెలియ బరచుచున్నాము.

ఈ జిల్లా రైతుసంఘము కీ॥ శే॥ కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగారి నాయకత్వముననే వారు చనిపోవు వరకు పనిచేయబడి ఉన్నతస్థితికి తేబడెను. వారు చనిపోవునప్పటికి భూపతిరాజు లక్ష్మినర్సరాజుగారు అధ్యక్షులుగాను, పేటేటి వెంకటరత్నంగారు కార్యదర్శి గాను గొట్టుముక్కల వెంకటాద్రిరాజు అబ్దుల్ మజీద్‌ఖాన్ గార్లు సహాయ కార్యదర్శులు గాను ఉండిరి. మొదటి ముగ్గురము నిరంతరము రైతుసేవలోనే నిమగ్నులమై పనిచేయుటచేతనే మమ్ము లను ప్రభుత్వము డెటిన్యూలుగానిర్బంధించింది. రైతు నాయకులందరు జైళ్ళకు వెళ్లుటచే రైతువుద్యమము స్థంభించింది. మరల రైతు కార్యక్రమము సాగించాలనే ఉద్దేశ్యముతో కార్యవర్గములో అప్పటికి మిగిలియున్న సహాయ కార్యదర్శియైన అబ్దుల్ మజీద్‌ఖాన్‌గారు, కొందరు రైతు సేవకులు జిల్లా రైతుసంఘము ది 17-1-1941 వ తేదీని జిన్నూరులో సమావేశము చేసి, పసల కృష్ణమూర్తి గారిని అధ్యక్షులు గాను యాళ్ళబండి పోలిశెట్టిగారిని కార్యదర్శి, గాను ఎన్నుకొనిరి. ఎన్నిక వెంటనే రాష్ట్ర రైతు సంఘమునకు ఈ విషయం తెలియబరచబడెను. అప్పటినుండియు సంఘ వ్యవహారములన్నియు యాళ్ళబండి పోలిశెట్టి గారే చూచుచుండిరి. అప్పటికిసభ్యత్వము జేర్పించే గడువు ఒకవారమే వుండుటచే, ఆఫీసులో వున్న జిల్లా సంఘ పుస్తకములలో 600 సభ్యత్వము జేర్పించి కోటా, రాష్ట్రసంఘమునకు పంపితిమి ఎన్నికలు ఎవరి అధ్యక్షతను జరిగెనని రాష్ట్ర సంఘమువారు జిల్లా సంఘమును ప్రశ్నించిరి. జిల్లా రైతు నాయకుల అరెష్టు సంగతి, మిగిలియున్న మజీద్‌ఖాన్‌గారి అధ్యక్షతను ఎన్నిక జరిగిన విధము వ్రాసి పంపినాము. కాని మాసంఘమును తాము గుర్తించుట లేదని మాకు తెలియబర్చలేదు. ఉత్తర ప్రత్యుత్తరములు మామూలుగానే జరుగుచుండెను. రాష్ట్ర సంఘ పుస్తకములలో జేర్పించక జిల్లా పుస్తకములలో జేర్పించినందున మా 600 సభ్యత్వము అంగీకరించుటలేదని తెలియ బరచినారు. మా ఎన్నిక జరుగునప్పటికి సభ్యత్వము జేర్పించు గడువు ఆరు రోజులు మాత్రమే ఉండుటచే మాసంఘ పుస్తకములలో జేర్పించుట తప్పనిసరియైనది. గాన తప్పకుండా మా సభ్యత్వము అంగీకరించమని వ్రాసితిమి. కాని వారు అంగీకరించలేదు. ఇప్పటికిని మా సభ్యత్వపు కోటా రాష్ట్ర రైతు సంఘము వద్దనే యున్నది.

మా సభ్యత్వము అంగీరించకపోయినప్పటికిని సంఘమును అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యముతో 42 వ సంవత్సరపు సభ్యత్వ పుస్తకములనైనను పంపమంటిమి. అచ్చువేయలేదని, వేయించిన వెంటనే పంపించెదమని వ్రాసినారు. కాని చాల కాలము వరకు పంపలేదు. సభ్యత్వ పుస్తకములు పంపమంటిమి కాని జాబులేదు రెండు మూడు ఉత్తరములు వ్రాసితిమి కాని జాబురేదు. చివరకు రిజిష్టరు పుత్తరము వ్రాసితిమి సభ్యత్వము జేర్పించే గడువు దాటేవరకు పూరుకొని సభ్యత్వ గడుపుదాటి పోవుటచే పుస్తకములు పంపమనీ, మాసంఘమును అంగీకరించుట లేదనీ. జిల్లాకు వచ్చి ఆలోచించి ఆర్గనైజింగు కమిటీని వేయుచుమనీ రాష్ట్ర రైతుసంఘ కార్యదర్శి వ్రాశారు.

ఈవిధముగ ఎప్పటి కప్పుడు మాకు రాష్ట్ర రైతుసంఘమునకు ఉత్తర ప్రత్యుత్తరములు జరిగినవి. ఈ జిల్లాలో రైతు నాయకులందరు జైళ్ళకు వెళ్ళినప్పటికి మిగిలియున్నకొద్దిమంది ఎప్పుడూ రైతు పనియే చేయుచుంటిమి. ఎప్పటికప్పుడు రాష్ట్ర సంఘము ప్రకటించు సభలు జరిపితిమి. నర్సాపురం తాలూకాలో చాల గ్రామములలో తిరిగి గ్రామ సభలు ఫిర్కా సభలు జరిపి రైతు ప్రచారము చేసితిమి ఈ సంవత్సరము ఫిబ్రవరిలో వచ్చిన నీటి ఎద్దడికి గ్రామ గ్రామమున సభలు పెట్టి మహాజర్లు టెలిగ్రాములు యిప్పించి సఫలత పొందితిమి.

మేము ఈ విధముగా శక్తివంచన లేకుండా పనిచేయుచుండగా, రాష్ట్రసంఘముతో ఎప్పటికప్పుడు ఉత్తర ప్రత్యుత్తరములు జరుగు చుండగ, మాకు తెలియ బరచకుండగానే ఈ జిల్లాలో ఇంతవరకు రైతువుద్యమంతో ఎట్టిసంబంధము లేని వారితో కూడిన ఆర్గనైజింగు కమిటీ ఏర్పాటు చేసియుండుటలో రాష్ట్ర రైతు సంఘమువారి ఉద్దేశ్యము మాకు బోధపడుటలేదు. ఇట్లు చేయుట చాల అన్యాయము.

కాని, పదవులయందు మాకు వ్యామోహం లేదు. మేము రైతు సేవకులము. తగవుల పెట్టుకొని రైతు వుద్యమాన్ని చీల్చుట మా వుద్దేశ్యము కాదు. మేము రైతు వుద్యమ శ్రేయస్సు కోరే అందరితోను సహకారము చేసి రైతు వుద్యమాభివృద్ధికి తోడ్పడుతామని తెలియ బరచుచున్నాము.

భూపతిరాజు లక్ష్మీనర్సరాజు,
మాజీ అధ్యక్షులు.
పేటేటి వెంకటరత్నం, మాజీకార్యదర్శి.
పసల కృష్ణమూర్తి, మాజీ అధ్యక్షులు.
యాళ్ళబండి పోలిశెట్టి, మాజీ కార్యదర్శి

కృష్ణాజిల్లా రైతుసంఘం

ది 16—7—42 తేదీన కృష్ణా జిల్లా రైతు సంఘ సాధారణ సభ్యుల సమావేశం సంఘ కార్యాలయంలో ముక్కామల నాగభూషణంగారి అధ్యక్షతను సమావేశమై చేసిన తీర్మానములు :—

1. యుద్ధ ఫలితంగా వర్తకులు అధిక లాభాలను గడించుటకు రైతుల నుండి కొనే వ్యవసాయక దినుసులు, ఆహార పంటల సరుకులను తక్కువ ధరలకు కొనడం, వాటినే విపరీతమైన హెచ్చు ధరలకు తిరిగి ప్రజలకు అమ్మడం వలన ప్రజల్లో తీవ్ర అసమ్మతి ప్రబలు చున్నవి, కూలీ వగైరా పేద జనులలో తీవ్ర అశాంతి ప్రబలుతున్నది. ఈ ధరల పెంపువలన పండించే రైతులు ఏమాత్రం సక్రమమైన ధరలు పొందుట లేదు. రైతులవద్ద కొనే ధాన్యం ధరకు, వర్తకులు బియ్యముకు విధించే ధరకు మధ్య అధిక వ్యత్యాస ముంటోంది. దీని వలన బియ్యము కొనే కూలీ వగైరా పేద జనులు అనేక కష్ట నష్టాల పాలవుచూ, జీవితావసరాలనే గడుపుకోలేని స్థితిలో వున్నారు' అందుచేత యిప్పటి యుద్ధావసరాల వలన ఆహార పదార్థాలకు యేర్పడ్డ డిమాండునుబట్టి లభించవలసిన ధరలు రైతులకువచ్చేటట్లు, కూలీ వగైరా పేద జనముకు అందుబాటులో బియ్యపు ధరలు వుండేటట్లు, ఆహార పదార్థాల ధరలను కంట్రోలు చేయవలసిన అవసర మున్నది. అప్పుడే దేశములో శాంతి కాపాడబడుతుంది. లూటీలు వగైరా భయానక పరిస్థితులు ఏర్పడవు.

ఇందుకు ప్రభుత్వం యీ దిగువ సూత్రాల ననుసరించి కంట్రోలు చేయాలి.

i. ధాన్యంకు కనీస ధరలు నియమించాలి. ఈ కనీస ధరలకంటె తక్కువకు రైతులవద్ద కొనే వర్తకులపై చర్య గైకొనాలి.

ii. ధాన్యంకు నియమించిన కనీస ధరల ప్రకారం రైతుల సరకులన్నీ విదుదల చేసుకునే యేర్పాట్లు ప్రభుత్వమే గావించాలి. ఇందుకు ప్రభుత్వమే రైతుల వద్దనుండి పైధరలకు ప్రభుత్వ యేజెన్సీల ద్వారా కొనే యేర్పాటులు చేయవచ్చును.

iii. బియ్యముకు గరిష్ట ధరలు (యింతకన్నా అధికంగాని) నియమించాలి, ఆ ధరలు నియమించే టప్పుడు ధాన్యం కనీస ధరలకూ, ముడి ధాన్యాన్ని బియ్యంగా మార్చే మిల్ చార్జీలూ, సరసమైన వర్తక లాభాలకు మాత్రమే సరిపోయేటంత వ్యత్యాసమే వుండాలి. అప్పుడే వర్తకుని అధిక లాభాలు అరికట్ట బడుతాయి.

iv. ప్రభుత్వమే గరిష్ట ధరలను తప్పక అమలులో వుంచడానికి, చౌక బియ్యపు కొట్లను తెరవాలి. గరిష్ట ధరలకు అమ్మడానికి నిరాకరించిన వర్తకులపై చర్య గైకొనాలి. అట్టి వర్తకుల బియ్యపు స్టాకులను, ఫ్యాక్టరీలను ప్రభుత్వం కంట్రోలులో వుంచుకోవాలి.

ఈ విషయంలో రైతు సంఘాలన్నీ సభలు, తీర్మానాలు, రాయబారముల ద్వారా ఆందోళన చేయాలి.

ఈ ధరల వ్యత్యాసమును నిరూపించి పని జేయుటకు యీ దిగువ సభ్యులతో కూడిన కమిటీని యేర్పరచడ మైనది.

1. ముక్కామల నాగభూషణం,
2. కాసూరి బలరామయ్యగారు
3. పడమట కోటేశ్వరరావుగారు

2. యుద్ధపరిస్థితులవల్ల ప్రజాసామాన్యానికి దైనందిన అవసరమగు, బట్టలు, మిర్చి కిరసనాయిలు, కొబ్బరినూనె, ఉప్పు, చింతపండు మొదలగు జీవితావసర వస్తువుల ధరలు విపరీతముగా పెరిగినాయి. దీనివలన ప్రజలు చాలా యిబ్బంది పడుతున్నారు. కాబట్టి సరసమైన ధరలకు జీవితావసర సామగ్రులు లభించుట కొరకు ప్రభుత్వము వారు వెంటనే కంట్రోలు ఏర్పరచి సక్రమముగా అమలు జరుగునట్లు తీవ్రప్రయత్నం చేయవలసినదిగానూ, ప్రభుత్వమే చవుక డిపోలు స్థాపించవలసినదిగానూ, యీ సభవారు కోరుతున్నారు.

3. 15—6—42 తేదీన గన్నవరంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో చేసిన తీర్మానమును. దానిమీద జిల్లా కలెక్టరు గారు తిరిగి పంపిన నోటీసును పరిశీలించి జిల్లా రైతుసంఘ అధ్యక్షులైన ముక్కామల నాగభూషణంగారిని కృష్ణా యిరిగేషన్ అడ్వైజరీ బోర్డు మెంబరుగా యెన్నుకోవడ మైనది.

కోవూరు తా॥ రైతుసంఘం

ది 12—7—42 తేదీని కోవూరు తాలూకా (నెల్లూరుజిల్లా) రైతుసంఘ కార్యవర్గం శ్రీ నూకలపాటి వెంకటరమణారెడ్డిగారి అధ్యక్షతను సమావేశమై ఈక్రింది తీర్మానాలు గావించింది.

1. పబ్లిక్‌వర్క్సు డిపార్టుమెంటు వారు అన్ని ప్రదేశములకును నారు పోసుకొనుటకు నీరు సప్లయిచేస్తామని చెప్పి కొన్ని ప్రదేశములకు చాల ముందుగానే యిచ్చి మిగతాప్రదేశాలకు 12-7-42వరకు కూడ నీరు యివ్వలేదు. దీనికి కారకులైన అధికారులపై P. W. డిపార్టుమెంటు వారు తగిన చర్య గైకొనవలెననీ, సాగుబడికిగాను 20-8-42 తేదీలోగా అన్ని ప్రదేశములకు నీరు సప్లయి చేయవలసినదిగాను కోరత మైనది.

డిటెన్యూలను, రాజకీయ ఖైదీలను విడిచిపెట్టాలి !

ఫాసిస్టు దురాక్రమణ ప్రమాదం ఎక్కువ అవుతున్న ఈ రోజులలో ప్రభుత్వం కొంత మంది ఫాసిస్టు వ్యతిరేక డిటెన్యూలను రాజకీయ ఖైదీలను మాత్రమే విడిచిపెట్టి ముఖ్యులైన వారిని కూడ ఇంకా చాలమందిని విడిచిపెట్టకపోవుటను నిరసించుతూ ఫాసిస్టు వ్యతిరేకులైన డిటెన్యూలను, రాజకీయ ఖైదీలందరినీ యెట్టి షరతులు లేకుండా వెంటనే విడిచిపెట్టాలనీ, ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రజా శక్తిని సమీకరించడానికి ప్రజా నాయకులైన వారి విడుదల అత్యంత అవసరమనీ కోరుతూ బహిరంగ సభలు వూరేగింపులూ ఆంధ్ర దేశమంతటా జరిగాయి. మాకు చేరిన రిపోర్టులలో కొన్ని యీ క్రింద ప్రకటిస్తున్నాము.

కాకినాడ

కాకినాడ ట్రేడ్ యూనియన్ విద్యార్థి సంఘాల యాజమాన్యాన జగన్నాధపురములో 200 మందితో వూరేగింపు, బహిరంగ సభ జరిగాయి. పందిరి జగదాంబగారు అధ్యక్షత వహించారు. కంభంపాటి సత్యనారాయణ (సీనియరు), ఇనుగంటి నారాయణరావు, పి. మార్కండేయ రాజు, అర్. చిన్నా గార్లు ఉపన్యసించారు.

రాజమండ్రి

తూ॥ గో॥ జిల్లా ఫాసిస్టు వ్యతిరేక ప్రచార కేంద్ర యాజమాన్యాన బహిరంగ సభ జరిగింది. పార్థసారధిగారు అధ్యక్షత వహించారు. శాస్త్రి, మామిడి అప్పారావు, అల్లూరి సోమరాజుగార్లు మాట్లాడారు.

రామచంద్రపురం

విద్యార్థి సంఘ యాజమాన్యాన వూరేగింపు బహిరంగ సభ జరిగాయి. సభకు జి. యస్. బాలాజీ దాస్‌గారధ్యక్షత వహించారు. పైడిమర్రి సత్యనారాయణ, వి. యస్. అర్. దీక్షిత్‌గార్లు మాట్లాడారు.

ఆత్రేయపురం

ఇందుకూరి వెంకటసోమరాజుగారి అధ్యక్షతను బహిరంగసభ జరిగింది.

మండపేట

కె. వి. కొండలరావుగారి అధ్యక్షతను బహిరంగసభ జరిగింది. జగ్గన్నశాస్త్రి, చినరఘుపతిరావు, పనస రామన్నగార్లు మాట్లాడారు.

అనాతవరం

అమలాపురం తాలూకా అనాతవరం గ్రామంలో ఎ. సూర్యనారాయణగారి అధ్యక్షతను సభజరిగింది. వి. గోపాలం, జి. లక్ష్మణరావుగార్లు ఉపన్యసించారు.

ఏలూరు

తాలూకా యువజనసంఘం, పట్టణ విద్యార్థి కార్మిక, యువజన, ప్రెస్ కార్మికసంఘాల యాజమాన్యాన వూరేగింపు, బహిరంగ సభ జరిగాయి. సభకు సత్తిరాజు రామమూర్తిగారు (జిల్లా కాంగ్రెసుసంఘ కార్యదర్శి) అధ్యక్షత వహించారు. అ. సర్వేశ్వర్రావు, బి. అప్పారావు, క. పోతురాజు, క. సింహాచలం, పే. వెంకటరత్నం, అ. వెం. సుబ్బారావుగార్లు ఉపన్యసించారు.

చాటపర్రు

గ్రామ యువజనసంఘం తరపున జి. మధుసూదనరావుగారి అధ్యక్షతను సభ జరిగింది. గుత్తా అంజనేయులుగారు మాట్లాడారు.

తాడేపల్లిగూడెం

వూరేగింపు, బహిరంగసభలు జరిగాయి. సభకు త్రివ్వేది వేణుగోపాలరావుగారు అధ్యక్షత వహించారు. ఇందుకూరి సుబ్బరాజు, పాసిం నారాయణరావు, అడ్డాల సూర్యనారాయణరాజుగార్లు ఉపన్యసించారు.

మల్లేశ్వరం

నెక్కలపూడి రామారావుగారి అధ్యక్షతను సభ జరిగింది.

బెజవాడ

టౌన్ ఫాసిస్టు వ్యతిరేక ప్రచార కేంద్రం, సిటీ యువజన సంఘం, మున్సిపల్ వర్కర్సు సంఘం వీటి యాజమాన్యాన వూరేగింపు, బహిరంగ సభ జరిగాయి. కంభంపాటి సత్యనారాయణ (జూనియరు) గారు అధ్యక్షత వహించారు.

తేలప్రోలు

ఆళ్ళ నారాయణగారి అధ్యక్షతను బహిరంగ సభ జరిగింది.

గుడివాడ

విద్యార్థి, మ్యునిసిపల్ పనివారల సంఘాల యాజమాన్యాన వూరేగింపు, తహసిల్‌దారుకు డిప్యుటేషను, బహిరంగ సభలు జరిగాయి.

వెంట్రప్రగడ

చంద్ర రాజేశ్వరరావుగారి అధ్యక్షతను సభ జరిగింది. సి. హెచ్. పూర్ణ చంద్రరావుగారు మాట్లాడారు. సభలో మహజరుపై 200 మంది సంతకాలు తీసుకోబడ్డాయి.

వానపాముల

చండ్ర రాజేశ్వరరావుగారి అధ్యక్షతను సభ జరిగింది. సభకు పూర్వం వూరేగింపు జరిగినది

ఎలమర్రు

బహిరంగ సభ జరిగింది. కొత్తూరి సుబ్బారావుగా రుపన్యసించారు.

భట్లపెనుమర్రు

చలసాని జగన్నాథరావుగారి అధ్యక్షతను సభ జరిగింది.

బొడ్డపాడు

గ్రామ రైతు, కూలీ, యువజన సంఘాల తరపున వూరేగింపు, బహిరంగ సభలు జరిగినాయి. యలమంచిలి వెంకటచలంగారధ్యక్షత వహించారు.

తోట్లవల్లూరు

గ్రామ రైతు సంఘ యాజమాన్యాన వూరేగింపు, బహిరంగ సభ జరిగినది. గన్నే వెంకటేశ్వరావుగారు సభకు అధ్యక్షత వహించారు

వల్లూరుపాలెం

గ్రామ రైతు యువజన-సంఘాలచే వూరేగింపు బహిరంగసభ జరుపబడ్డాయి.

నాదెళ్ళవారిపాలెం

రైతు, యువజన, మహిళాసంఘాల తరపున వూరేగింపు, మీటింగు జరిగాయి. సభకు నాదెళ్ళ అంజయ్యగారు అధ్యక్షులు, అరిపిరాల దక్షిణామూర్తి, తమ్మా నాగేంద్రం గార్లు మాట్లాడారు.

మైలవరం

వూరేగింపు జరిగినపిమ్మట అ॥ వెం॥ సీతారామారావుగారి అధ్యక్షతను సభ జరిగింది.

విస్సన్నపేట

తిరువూరు తాలూకా రైతుసంఘ యాజమాన్యాన వూరేగింపు, బహిరంగసభ జరిగాయి సభకు సయ్యద్ సాలాహ్‌గారు అధ్యక్షులు.

గుంటూరు

పట్టణవిద్యార్థి, యువజనసంఘాల యాజమాన్యాన బహిరంగసభ జరుపబడింది. సభకు పూర్వం సైకిళ్ళ వూరేగింపు జరిగింది. సభకు మోటూరి కట్టయ్యగారు అధ్యక్షులు. కంభంపాటి శ్రీరామమూర్తి, ఎ. పురుషోత్తమరావుగార్లు ఉపన్యసించారు

తెనాలి

కె. సత్యనారాయణగారి అధ్యక్షతన సభ జరిగింది. అరవేటి రామయ్య, తేలప్రోలు సుబ్బారావు, ఘంటా సీతారామయ్య, బి. సివరాంగార్లు మాట్లాడారు.

క్రాప

గ్రామ యువజనసంఘ యాజమాన్యాన, ఖండ్రిక లక్ష్మీపతిగారి అధ్యక్షతను సభ జరిగింది. గోగినేని నాగేశ్వరావుగారు ఉపన్యసించారు.

పెదనందిపాడు

గ్రామ యువజనసంఘం తరపున, పెద వీరయ్యగారి అధ్యక్షతను సభ జరిగింది. భద్రరాజు వెంకటప్పలరాజుగారు మాట్లాడారు.

కనగాల

గ్రామ యువజన సంఘయాజమాన్యాన, కస్తూరి కుటుంబరావుగారి అధ్యక్షతను సభ, నాటక ప్రదర్శనం జరిగాయి.

జూపూడి

గ్రామ యువజనసంఘ యాజమాన్యాన, వేజెండ్ల సత్యనారాయణగారి అధ్యక్షతను సభజరిగింది. శేషశాస్త్రి, లోకనాధంగార్లు మాట్లాడారు.

వేటపాలెం

యువజనసంఘ యాజమాన్యమున, సి. లక్ష్మీపతిగారి అధ్యక్షతను సభ జరిగింది.

నెల్లూరు

ఓరుగంటి వెంకటసుబ్బయ్యగారి అధ్యక్షతను సభ జరిగింది.

ఆత్మకూరు

పెద్ద బహిరంగ సభ జరిగింది, డి. రామచంద్రారెడ్డిగారు అధ్యక్షత వహించారు, యం. శంకరయ్య, జి. సి; కొండయ్యగార్లు ఉపన్యసించారు.

వాసిలి, ఆత్మకూరు, కుప్పరుపాడు, కొలగొట్ల మొదలైన గ్రామాలనుండి ప్రభుత్వానికి మహజర్లు పంపబడ్డాయి.

నాయుడుపేట

గ్రామ యువజన సంఘ అధ్వర్యం క్రింద రావు వెంకట సుబ్బయ్యగారి అధ్యక్షతను సభ జరిగింది, కోవూరు కాశప్ప, చెరువు శ్రీనివాసులుగార్లు మాట్లాడారు.

ఉమ్మారెడ్డిపల్లె

కడప జిల్లా ఉమ్మారెడ్డిపల్లెలో టి. అర్. రెడ్డిగారి అధ్యక్షతను సభ జరిగింది.

కర్నూలు

వూరేగింపు అనంతరం జి. కె. శ్రీ గిరిరావు బి. ఏ., బి. ఎల్. గారి అధ్యక్షతను సభ జరిగింది. కోటయ్య, పుల్లారెడ్డి, రఘురామయ్య గుప్తగార్లు ఉపన్యసించారు.

తెల్ల కాగితాల ధర తగ్గాలి.

విద్యార్థుల ఆందోళన

తెల్ల కాగితాల ధర విపరీతంగా పెరిగిపోవుట వల్ల విద్యార్థులకు చాల కష్టంగా వుంది. అందుచే తెల్ల కాగితాల ధరలను కంట్రోలు చెయ్యాలని విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు.

10—7—42 తేదీని గుంటూరులో 400 మంది విద్యార్థులు తెల్ల కాగితాల ధరను కంట్రోలు చేయాలనే నినాదాలతో వూరేగింపు జరిపి, జిల్లా కలెక్టరు వద్దకు డిప్యుటేషను వెళ్ళారు.

1000 మంది విద్యార్థులచే సంతకములు చేయబడిన మహజరును సమర్పించారు. కలెక్టరుగారు తగు చర్య తీసుకుంటామని వాగ్దానం చేశారు. తరువాత విద్యార్థులు ఒక బహిరంగసభ జరిపారు.

16—7—42 తేదీని బెజవాడలో 300 మంది విద్యార్థులు అదే నినాదాలతో వూరేగింపు జరిపి, తహసిల్‌దారు వద్దకు డిప్యుటేషను వెళ్ళారు. తహసిల్‌దారుగారు యెక్కువ ధరలకు అమ్మే వర్తకులవద్ద బిల్లులు పుచ్చుకొని తమకు యిస్తే చర్య తీసుకుంటామని వాగ్దానం చేశారు.

తరువాత విద్యార్థులు కామ్రేడ్ కంభంపాటి సత్యనారాయణ బి. ఏ., (ఆనర్సు) బి. ఎల్. గారి అధ్యక్షతను బహిరంగ సభ జరిపారు.

విద్యార్థులపై హెడ్‌మాష్టర్ల దాడి

పామర్రు.

పామర్రు హైస్కూలు హెడ్‌మాష్టరుగారు గత సంవత్సరం స్కూలు ఫైనలు పరీక్షలో తప్పిన విద్యార్థులను, వారి గార్డియనులను యీ సంవత్సరం జరగబోయే సెలెక్షన్ పరీక్షలో డిబెయిన్ చేస్తే మేమే బాధ్యులమని బాండులు వ్రాసి యివ్వమని నిర్బంధించుతున్నారు. అలా యివ్వనివారిని స్కూలులో చేర్చుకోడం లేదు.

విద్యార్థియొక్క తల్లిగాని, తండ్రిగాని బ్రతికియున్నంత వరకు అతడు వారి పోషణక్రింద వున్నా లేకపోయినా స్కూలులో జేర్చుకునేటప్పుడు గార్డియనుగా ఇతరు లెవ్వరిసంతకం పనికిరాదని స్కూలులో జేర్చుకొనకుండా నిర్బంధించు తున్నారు.

మారుటేరు

మారుటేరు హెడ్ మాష్టరుగారు పామర్రు హెడ్ మాష్టరుగారిని మించిపోయారు. విద్యార్థులు విద్యార్థి సంఘ కార్యక్రమంలో దేనిలోను పాల్గొనము అని వ్రాసి ఇవ్వాలంటున్నారు. అలా యివ్వనివారి జీతాలుకూడా కట్టుకోవద్దని రైటరుగారికి హుకుం జారీచేసి విద్యార్థుల జీతాలు కట్టుకోకుండా, స్కూలులోకి వచ్చినా ఆబ్సెంటు మార్కు వేసి యేడ్పించుతున్నారు.

అధిక లాభాలను అరికట్టండి!

26 వ తేదీని దేశమంతటా అసమ్మతి ప్రదర్శనాలు జరపండి !

అఖిలభారత కిసాన్ సభ అధ్యక్షులు ఇందులాల్‌యాగ్నిక్, ప్రధాన కార్యదర్శి స్వామిసహజానంద గార్లు ఈక్రింది ప్రకటన గావిస్తున్నారు.

"జీవితావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పోతున్నాయి. యుద్ధం ప్రారంభమైన నాటినుండీ కొందరు వర్తకులు లాభాలకోసం అత్యవసరమైన సరకుల ధరలను కృత్రిమంగా పెంచివేశారు. మన దేశానికి యుద్ధ ప్రమాదం ఎక్కువ అవడం సరకుల రవాణా సౌకర్యాలు తగ్గిపోడం, వర్తకులకు మంచి సాకుగా దొరికాయి.

"ప్రభుత్వం ఈ ప్రమాదాన్ని గుర్తించింది. వస్తువుల ధరలను కంట్రోలు చేయడానికి, సరకుల రవాణా సదుపాయాలు తగ్గిపోకుండా చేయడానికి పూనుకుంది. కాని జిత్తులమారి వర్తకులు, ఎప్పటి కప్పుడు ప్రభుత్వ ఆర్డర్లను అతిక్రమించడానికి ఏదో ఒక పన్నుగడ పన్నుతూనేవున్నారు. వర్తకులు తామిది వరకే చౌక ధరలకు కొని నిలవ జేసినధాన్యం వగైరా ఆహార పదార్థాలను ఎక్కువ ధరలకు దొడ్డి గుమ్మాల గుండా అమ్ముకుంటూనే వున్నారు. రైలు వేగన్లుగాని, పెట్రోలుగాని దొరకక పోవడం మూలాన ఎక్కువ సరకు నిలవ జేసుకొనలేక పోతున్నారనేది కల్ల. వారు బహిరంగంగా ప్రభుత్వ ఆర్డర్లను ధిక్కరిస్తూనే వున్నారు. నేడు దేశ మంతా ఒక దొంగబజారుగా తయారైవుంది. ఈవిధంగా అత్యల్ప సంఖ్యాకులైన కొద్దిమంది వర్తకులు, తమ లాభాల కాంక్షతో కోట్లకొలది ప్రజలను మాడ్చి చంపుతున్నారు. ఇట్టి దేశీయ దోపిడి గాండ్రను దేశంలో లేకుండా చేసుకొనక పోతే రేపు జపానుకు వ్యతిరేకంగా మన దేశన్ని రక్షించుకొనడానికి మనం తగినంత బలంకలిగి వుండలేము.

"అందుచేత మేము ప్రభుత్వానికొక మనవి చేస్తున్నాం. ప్రజల ఆహార సరఫరా విషయంలో ప్రభుత్వం అశ్రద్ధ చేయ కూడదు. ఈ దొంగమార్కెట్లను, అధికలాభాలను ధైర్యంతో, నిర్దాక్షిణ్యంగా నిర్మూలం చేయాలి. ఈ రక్తపిపాసుల చేతులలో నుండి ఆహార పదార్థాలను లాగి ప్రజానీకానికి ఇవ్వాలి. ముందు మన దేశంలోని ఆకలిసమస్యను జయప్రదంగాపరిష్కరించకపోతే రేపు జపాన్ ఫాసిజాన్ని జయించలేము.

"అలా అని ప్రజలు చేతులుముడుచుకుని కూర్చోకూడదు ఈ అధిక లాభాల బ్రహ్మరాక్షసిని కోరలు పట్టి బైటకీడ్వాలి. దీనికి రైతు సంఘాలు, రైతు జనసామాన్యం పూనుకోవాలి. బీహారులో రైతులప్పుడే ఈ ఉద్యమం ప్రారంభించారు. మన ఈ ఉద్యమంలో కూలీ సోదరులు, మధ్యతరగతి ప్రజలు అందరూ తప్పక పాల్గొని సహాయం చేస్తారు. మనము తప్పక జయించి తీరుతాము.

"కాబట్టి దేశములోని రైతుసంఘాలు రైతుజనము, కార్మికులు, ఇంకా ఇతర ప్రజలు అంతా ఈ అధిక లాభాల అసమ్మతి దినంగా ఈ నెల 26 వ తేదీని బ్రహ్మాండమైన వూరేగింపులు, బహిరంగ సభలు జరపాలని కోరుతున్నాము."

• • •

ప॥ గో॥ జిల్లా వ్యవసాయ కూలీ సంఘ కార్యదర్శి నెక్కంటి నరసింహారావు (ఆచంట) గారిట్లు వ్రాస్తున్నారు. "ప॥ గో॥ జిల్లా వస్తుధరల నిర్ణయ సంఘం వారిచే నిర్ణయించబడిన ధరలకు అమ్మవలసినదిగా వర్తకులను ప్రభుత్వం హెచ్చరించినను, చాలగ్రామాలలో వర్తకులు హెచ్చుధరలకు సరకులను అమ్ముతూనే వున్నారు. పైగా అమ్మిన సరకులకు రశీదు ఇవ్వనిరాకరించు తున్నారు. దీనిని గూర్చి మా జిల్లాసంఘ ఆఫీసుకు అనేక రిపోర్టులు వస్తున్నాయి. అందుచే జిల్లాలో ప్రతిచోటు నుండియు వ్యవసాయకూలీలు, అట్లుప్రవర్తించే వర్తకులపై ప్రభుత్వాధికారులకు రిపోర్టు చేయండి.

ప్రభుత్వం అధిక లాభాలను అరికట్టాలని, చౌక ధరకు కో ఆపరేటివ్ స్టోర్సు పెట్టాలని మహజర్లు పంపండి. పూరూర అసమ్మతి ప్రదర్శనాలు బహిరంగ సభలు పెట్టి ఆందోళన చెయ్యండి.

• • •

జూపూడి గ్రామంలోని వర్తకులు ప్రభుత్వం కంట్రోలుపెట్టిననిప్పుపెట్టెలు, కిరసనాయిల్ వగైరాల ధరల కంటె ఎక్కువ రేట్లకమ్ముచున్నందున గ్రామములో మకాము వేసియున్న డిప్యూటి తహసిల్దారుగారి యొద్దకు ది 13-7-42 తేదీని రైతులు, కూలీలు 250 మంది ఊరేగుతూ వెళ్ళి సాహుకారు చేయుచున్న అన్యాయమును గురించి మనవి చేసికొని మహజరు కూడ సమర్పించుకొనిరి. తహశ్శీల్‌దారుగారు షాహుకార్లు ఎక్కువధరలకు అమ్మే ఎడల తనకు రిపోర్టు చేయమని, చర్యతీసుకొంటానని షాహుకార్లను పిలిపించి వారితో మాట్లాడి ధరలబోర్డు ప్రతి కొట్టు ముందు వేయిస్తానని చెప్పారు.

డిప్యుటేషనుకుముందు కూలీ రైతుల బహిరంగసభ జరిగినది. పారిశ్రామిక వస్తువుల అవసరాన్ని గురించి, తినుపదార్థాల చౌకఅంగళ్ళనుగురించి జపాను దాడిని ఎదుర్కొనవలసిన ఆవశ్యకత కూలీ సంఘాల ఆవశ్యకతను గురించి మాట్లాడారు.

"ప్రజా యుద్ధం"

8—7—42 ప్రజా శక్తి పత్రికలో (2 వ పేజీ) ప్రకటించబడిన నా వ్యాసములో "ప్రజా యుద్ధం అవునా కాదా అనే సమస్య అప్రధాన మైనది" అని వాడాను. ఇది కొందరి మిత్రులలో సందేహాలకు కారణమయింది. ఆవిధంగా వ్రాయడంలోని పొరబాటును గుర్తించుతున్నాను. నా ఉద్దేశ్యాన్ని క్రింద పొందు పరుస్తున్నాను.

కమ్యూనిష్టులము యిది ప్రజా యుద్ధమని అచంచలమైన విశ్వాసాన్ని కలిగి వున్నాము. అందుకనే జపాను ఫాసిస్టుల దుండగీడులకు వ్యతిరేకంగా దేశాన్ని రక్షించడానికి సర్వస్వం ధారపోయడానికి సిద్ధంగా వున్నాము. అందుకొరకు సన్నాహాలు చేస్తున్నాము. కిసాన్ సభలో కొందరు యిది ప్రజా యుద్ధమని అంగీకరించకపోయినా జపానుకు వ్యతిరేకంగా జరిగే దేశ రక్షణ కార్యకలాపంలో వెంటనే ఆచరింపదగిన కార్యక్రమంలో మాతో సహకారం చేస్తామంటున్నారు. అట్టి వారితో ప్రజా యుద్ధమవునా, కాదా అనే వాగ్వాదం అనవసరంగా జేసి, వారిని ఆచరణలో జపాన్ వ్యతిరేక పోరాటాన్నుంచి దూరం చేయడం సబబు కాదని మా అభిప్రాయం. కలిసి పనిచేసి దేశ రక్షణ కార్యక్రమంలో పాల్గొనుట ద్వారానే వారికి యిది ప్రజా యుద్ధమని రుజువు చేయగలమనీ, నచ్చ చెప్పగలమని మా భావం. అందుచే ఇది ప్రజా యుద్ధం అవునా కాదా అన్నచర్చ, వాగ్వాదం అనవసరమని మా అభిప్రాయం. ఈ సంగతి పాఠకులు గుర్తించాలని నా ప్రార్థన

చలసాని వాసుదేవరావు.

చల్లపల్లి ఎస్టేటులో అరెస్టులు - లాఠీచార్జీలు

కామ్రేడ్ చండ్ర రాజేశ్వరరావుగారిని అరెస్టు చేశారు

చల్లపల్లి ఎస్టేటులోని మంగళాపురంలోని అటవీ ప్రాంతాన్ని అచ్చటి ముత్రాసులు బాగుచేసి, యకరానికి రు 8-0-0 చొ॥ పన్ను చెల్లిస్తూ 1938 సం॥నుంచి అందులో పాదులు వగైరా పైరులు పండించుకుంటూ జీవిస్తున్న సంగతి, ఇప్పుడా భూమిని జమీందారు ఆక్రమింపబోగా ముత్రాసులు ఆటంక పరచుటను, ఆ సందర్భంలో 30 మంది ముత్రాసులను పోలీసులు అరెస్టు చేసి కేసులు పెట్టడం యివన్నీ ది 8—7—42 తేదీ "ప్రజాశక్తి" లో ప్రకటింపబడ్డాయి.

కాని యిప్పుడా సమస్య విషమించుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.

ది 17—7—42 తేదీని అవనిగడ్డ మేజిస్ట్రేటుగారు 48 మంది ముత్రాసులకు, ఆ భూమిలో ప్రవేశించ కూడదని 144 సెక్షను నోటీసులు జారీ చేశారు.

20—7—42 తేదీ ఉదయం 10 గం॥లకు 300 మంది జమీందారు మనుష్యులు ఒక పోలీసు యిన్‌స్పెక్టరు, ఆరుగురు కాని స్టేబుల్సుసహాయంతోవచ్చి భూమిలో దౌర్జన్యంగా ప్రవేశించ బోయారు. జమీందారు మనుష్యులు తప్ప యితరులెవ్వరూ ఆ భూమిలో ప్రవేశించ గూడదని స్థలానికే 144 సెక్షను ఇవ్వబడింది. ముత్రాసులు 5 సం॥ నుండి తమ హక్కు భుక్తములో వున్న భూమిలో జమీందారు మనుష్య లీ విధముగా అక్రమముగా వచ్చి ఆక్రమింప జూచుటను అడ్డగించారు. దానిపై షుమారు 70 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ముత్రాసులపై లాఠీ చార్జీ చేశారు. గుర్రాలను తెచ్చి మనుష్యులపైకి తోలించారు. ఈ అరెష్టయిన వారిలో ముఖ్యులు కామ్రేడ్స్, చండ్ర రాజేశ్వరరావు (వీరిపై ప్రభుత్వం యీ మధ్యనే డిటెన్షను ఆర్డరు రద్దు చేసింది), గుంటూరు బాపనయ్య (జిల్లా వ్యవసాయ కూలీ సంఘ కార్యదర్శి), కాకర్ల వెంకటేశ్వరావు (దివి తాలూకా వ్య॥ కూలీ సంఘ అధ్యక్షుడు), కొల్లి సీతారామయ్యగార్లు.

ఈ సందర్భంలో ఒక విషయం గమనించాలి. ఇప్పుడు తగాదాలో వున్న భూమి జమీందారు హక్కుభుక్తాలలో లేదు. ఈ భూమి 1938 సం॥ నుండి ముత్రాసుల హక్కుభుక్తంలో వున్నట్లు దుజువు లున్నాయి. ప్రభుత్వానికి ముత్రాసులు కట్టిన పెనాల్టీ రశీదు లున్నాయి. చల్లపల్లి యెస్టేటువారికి కూడ యకరానికి రు 8—0—0 చొ॥ ముత్రాసులు శిస్తు చెల్లిస్తూనే వున్నారు. ఈ విషయము యెస్టేటు జమా బందీ లెక్కలు చూస్తే రుజువు అవుతుంది. ఇవిగాక ముత్రాసులు పెట్టుకున్న పాదులు వగైరా ఆ భూమిలో ఇప్పటికీ కనపడుతూవున్నాయి.

ఇలా వుండగా స్థానిక ప్రభుత్వాధికారులు ఆ భూమి హక్కుకోసం 4 సం॥ నుంచి అనుభవిస్తున్న ముత్రాసులకు వ్యతిరేకంగా జమీందారుకు మద్దతు వెళ్ళడం అంటే—అవనిగడ్డ మేజిస్ట్రేటుగారు, జమీందారు మనుష్యులు తప్ప యితరు లెవ్వరూ ఆ భూమిలో ప్రవేశించగూడదని 144 యివ్వడం, జమీందారుగారి రౌడీమూకకు పోలీసులు సహాయం వెళ్ళడం, వ్యవసాయ కూలీలపై లాఠీచార్జీ చేసి, వారిని అరెస్టు చేయడం, గుర్రాలచే తొక్కించడం మొదలగు దుర్మార్గానికి పూనుకోడం, ముత్రాసు రైతుల మొరపై డిప్యూటీ కలెక్టరుగారు, తహశీల్‌దారుగారిని వెంటనే వెళ్ళి పూర్తి యిన్‌పర్‌మేషను తీసికో వలసిన దని అర్డరు వేసినా వారట్లు చేయకుండా వూరుకోడం, యివన్నీ చాల అన్యాయం. పై ప్రభుత్వాధికారు లీ విషయంపై తగు శ్రద్ధ తీసికొని మరి విషమించకుండా చేయాలి.

ఫాసిస్టు వ్యతిరేక ప్రజా ఉద్యమం

గత మే 24 వ తేదీన నాగపూరులో చిట్నిస్ పార్కులో ఫాసిస్టు వ్యతిరేక మహా సమావేశం (రాలీ) జరిగింది. 20 వేలమంది హాజరయ్యారు. రాష్ట్ర రైతు సంఘం, విద్యార్థి సంఘం, ప్రెస్ కార్మిక సంఘాల యాజమాన్యాన యీ సమావేశం జరిగింది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలనుండి ప్రతినిధులు వచ్చారు. చుట్టుపట్ల గ్రామాలనుండి వేలకొలది రైతులు తండోప తండాలుగా విచ్చేశారు. నాగపూరు కార్మికులు వచ్చారని వేరే చెప్ప నక్కరలేదు. మహాసభకు గుండెకాయ వారేనని చెప్ప నవసరం లేదు.

కన్నుల పండువుగా అంతమంది ప్రజలతో క్రిక్కిసలాడు చున్న చిట్నిస్ పార్కు మధ్యను ఒక పెద్ద సోవియట్ జెండా ఎగురుతోంది. దాని కిరు ప్రక్కలా పైనా, హిందూ దేశ జాతీయ పతాకా లున్నాయి. "హిందూస్థాన్ మనది. దీని రక్షణ మనం చేస్తాం: మన దేశంకోసం యీ యుద్ధం, మన స్వాతంత్ర్యం కోసం యీ యుద్ధం, దేశరక్షణకు జాతీయైక్యతకావాలి; జాతీయ ప్రభుత్వం కావాలి; ప్రజలకు ఆయుధా లివ్వండి; కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగించండి" అనే నినాదాలను సభాస్థలంలో అలంకరించారు.

కార్మికు లిద్దరు పాడిన ఉత్తేజకరమైన గీతాలతో సభ ప్రారంభమయింది.

స్పైన్ యోధుడు :

స్పైన్‌లో అంతర్జాతీయ బ్రిగేడ్‌లో ఫాసిస్టు హంతకులతో పోరాడే భాగ్యం మన దేశంలో కొద్దిమందికే గల్గింది. అలాంటివారిలో కామ్రేడ్ హుద్దారు ఒకడు. ఆయన సభను ప్రారంభించుతూ "ఫాసిస్టు దోపిడిగాండ్ర సామ్రాజ్యవాదం మన దేశాన్ని యెదుర్కొన బోతున్నది. మనం తటస్థంగా వుండగలమా? ఉండలేము. ఉండజాలము. మన మాతృ భూమిని, మన గౌరవాన్ని, మన ఆస్థిపాస్థులను, మనం ప్రేమించే మన కుటుంబాలను రక్షించుకోవాలి."

కామ్రేడ్ అష్రాఫ్ :

తర్వాత కామ్రేడ్ అష్రాఫ్ గంటకు పైగా ఉపన్యసించాడు. అందరూ అతని ఉపన్యాసానికి ముగ్ధు లయ్యారు. జాతీయ అంతర్జాతీయ పరిస్థితులను వివరించి యిలా అన్నాడు.

"మన దేశాన్ని సంరక్షించు కునేందుకు మనం ఐక్యం కావాలి. అలా పోరాడటంలోనే మనం మన స్వాతంత్ర్యాన్ని సంపాదిస్తాం. స్వాతంత్ర్యాన్ని ప్రేమించే ప్రజాశక్తులన్ని మనపైనె ఉన్నాయి."

"భవితవ్య" (ఫేసిస్టు వ్యతిరేకవార పత్రిక) సంపాదకుడు దేశపాండే ప్రధాన తీర్మానం ఉపపాదించాడు. పూర్వం నుండీ కాంగ్రెసు వర్కరయిన కాకౌత్కర్, ఎంప్రెస్ మిల్లులోని అబాజీ సాలుంకేగార్లు దానిని బలపరచారు. సోవియటు రష్యాపై దుష్ప్రచారానికి గాను ఒక హిందూ మహా సభవాలా తెచ్చిన సవరణను ప్రవేశ పెట్టనీయలేదు. కొద్దిమంది అల్లరి చేయాలను కొన్న హిందూ మహాసభ వాలాల ఆటలు సాగలేదు. హర్షధ్వానుల మధ్య తీర్మానం నెగ్గింది.

మహా సమావేశ అనంతరం "ఫోర్ కామ్రేడ్స్" (నల్గురు కామ్రేడ్‌లు) అనే నాటకం బాగా ప్రదర్శించి ప్రజల మన్ననలను పొందారు.

అమరావతి (బీరార్)

ఈ సంవత్సరం బీరారు రాష్ట్ర రైతు సంఘ ద్వితీయ మహాసభ, ఫాసిస్టు వ్యతిరేక మహా సమావేశమూ రెండు అమరావతిలో జరిగాయి. ఈ సమావేశానికి లక్షమందిని ఖోగుచేయాలని రాష్ట్రరైతుసంఘం నినాదం ఇచ్చింది. ఇది పూర్తిగాక పోయినా వేలకొలది రైతులు, వందల కొలది రైతు వర్కర్లు రాష్ట్రంలో అన్ని భాగాలనుండి రావడం వలన జయ ప్రదమయింది.

దీనికి ముందు 15 రోజులకు పూర్వం 50 మంది రైతు యువకులకు (మిలిటెంట్సుకు) రైతుసమస్యలపైన, రాజకీయ ప్రచారంపైన, ఎ. ఆర్. పి. (విమానదాడి సంరక్షణ) పైన శిక్షణ ఈయబడింది.

యువకచిత్రకారులు తయారు చేసిన సోవియటు చిత్రప్రదర్శనం, స్థానిక సోవియటు మిత్రమండలి యాజమాన్యానజరిగింది. పీడించే వారిని తుదముట్టించిన కార్మిక కర్షకుల భూమిని గురించి తెలుసుకొన్నపుడు, రైతులందరూ ఆశ్చర్యంలో మునిగి పోయారు. అమరావతి వ్యవసాయ సంఘ యాజమాన్యాన వ్యవసాయక ప్రదర్శనం కూడా జరిగింది.

మే 20 వ తేదీన రైతు యాత్రిదళాలు వచ్చాయి. ఎలిచ్‌పూర్, బద్నేరాలనుండి నేత పారిశ్రామిక కార్మికులు విప్లవ గీతాలు పాడుకుంటూ ఊరేగింపులలోవచ్చారు. నెహ్రూ మైదాన్‌లో సభ జరిగింది. సోవియట్ టాంకు ఆకృతిలో వేదిక నిర్మించబడింది. తెల్లటి అక్షరాలతో ఆ బూడిదరంగు కవచంమీద "జనతాకీ-తాకత్" (ప్రజాశక్తి) అని వ్రాయబడింది. సుత్తీ, కొడవలి పట్టుకున్న రైతు యువతీ యువకుల 15 అడుగుల విగ్రహం ఒకటి వెను భాగంలో వుంది. ఇదంతా మన సానుభూతిపరుడైన శిల్పి చేసిన పని.

ఆహ్వాన సంఘాధ్యక్షుడు టి. జి. జోషి బీరారు రైతుల ఆర్థిక కష్టాలను వివరించి, ఫాసిస్టు దురాక్రమణను ప్రతిఘటించాలని ఉత్తేజకరమైన ఉపన్యాసం గావించాడు. ఇలా అన్నాడు. "ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడాల్సి అంటే దాని అర్థం బ్రిటిషు సామ్రాజ్యవాదానికి లొంగటం అనికాదు. హిందూదేశ ప్రజలు మేల్కొని ఐక్యపడితేనే దురాక్రమణదారులను ప్రతిఘటించగలరు. ఫాసిస్టులకు వ్యతిరేకంగా ప్రతిఘటించడం మన స్వాతంత్ర్య కూటంతో ముడిపెట్టబడింది."

కామ్రేడ్ ఇందులాల్ యాజ్నిక్ తన అధ్యక్షోపన్యాసంలో నాగపూరు కేంద్ర కిసాన్ కార్యవర్గ తీర్మానాన్ని వివరించాడు. మొదటి తీర్మానము బీరారు రైతుల కోర్కెలను తెలియజేస్తూవుంది. రెండవది నాగపూరు తీర్మానాన్ని బలపరచుతూ వుంది, ఈ రెండు తీర్మానాలును ప్యాసయినాయి.

మంచి వుత్సాహవంతంగా మహా సమావేశము ముగిసింది. కొత్త పాటలతో, కొత్త నినాదాలతో కిసాన్ యువకులు వెళ్ళిపోయారు. "ఇది మా జన్మ భూమి. దురాక్రమణను ప్రతిఘటించి దానిని రక్షిస్తాం" - ఇదీ వారి పెదవులనుండి వెడలిన మాట.

చాలీస్ గావ్

యావత్ ఖందేష్ కార్మికుల నాల్గవ వార్షిక మహాసభ మే 23 వ తేదిన జరిగింది. ఈసమావేశం ఫాసిస్టు వ్యతిరేక ప్రజా యుద్ధపాలసీని తెలియ జేయడానికి స్థానిక మిల్లు యజమానుల దాడిని (పనిలోనుండి తొలగించడం మొదలైన) ఎదుర్కొన డానికి గాను సమావేశపరచబడింది.

అమాల్నరు ధూలియా, జలగావ్‌ల నుండి వేలకొలది కార్మికులు యాత్రలు సలిపారు. కొన్నికొన్ని ప్రచారక దళాలుగా ఏర్పడి, ఎడ్ల బండ్లమీద, సైకిళ్లమీద, గ్రామాలలో ఎర్రజెండా సందేశాన్ని తెలియ జేస్తూప్రచారం చేశారు.

23 వ తేదీ, ఉదయాన జండాప్రతిష్ఠ, అధ్యక్షుని ఊరేగింపు, వలంటీర్ల ఊరేగింపులు జరిగాయి "ప్రపంచ ఫాసిస్టులను హతమార్చండి; ఈ దేశంమాది, దీనిని మేంరక్షించు కొంటాం" అనేనినాదాలతో చాలిస్‌గావ్ దద్దరిల్లిపోయింది. ఖాందేష్‌లోని ప్రతి కార్మిక కేంద్రంనుండి 15 గురు ప్రతినిధులు వచ్చారు. విషయనిర్ణయ సభలో "ప్రపంచ స్వాతంత్ర్యయుద్ధం" జాతీయ రక్షణ మన కర్తవ్యాలు" "మిల్లుయజమానుల నిర్బంధానికి వ్యతిరేకంగా సమ్మెప్రచారం" మొదలగు తీర్మానాలు ప్యాసయినాయి.

బహిరంగ సభకు 7 వేలమంది కార్మికులు హాజరయ్యారు కవులు, కార్మిక "గాయకులు ఫాసిస్టు వ్యతిరేకగేయాలను సోవియటు సాధించిన వాటి మీద గేయాలను పాడారు. సహజానంద, అషంఫ్, బంకింమ్, సర్దేశాయి, దేశపాండేలసందేశాలు చదువ బడినాయి.

పుందాలిక్ పటేలు స్వాగతోపన్యాస అనంతరం, కార్మిక నాయకుడగు నందేద్కర్ అధ్యక్షోపన్యాసం ఇచ్చాడు. ప్రజాయుద్ధం గురించీ, ప్రజారక్షణ కమిటీలను ప్రజావలంటీర్ బ్రిగేడ్‌లను ఏర్పఱచాలని విమానదాడి రక్షణ తర్ఫీదు పొందాలని చెప్పిన తర్వాత కార్మికులకూ మిల్లుయజమానులకూ ఉండవలసిన బాంధవ్యాన్ని గురించి ఇలా చెప్పాడు. కార్మికులలో మంచి దిట్టమైన యోధులను కొందరు మిల్లు యజమానులు పనినుండితొలగించు తున్నారు.

ఈ క్లిష్ట సమయంలో యిది వినాశనకరమైన పద్ధతి. తగిన దేశ రక్షణకు కార్మికులు అడ్డం రారు. మిల్లులను త్వరగా పని చేయించాలని, ప్రశాంతంగా పని చేయించాలని కార్మికులు కోరతారు. పరిశ్రమలలో గౌరవప్రదమైన రాజీని శాంతిని కోరతారు. కాని, మా యోధులను తొలగించుట ద్వారా, మా యూనియన్‌లను నాశనం చేయుటద్వారా, శాంతిని పొందవచ్చునని మిల్లు యజమానులు తలచినట్లయితే వారు పొరబడు చున్నారు. అలాంటి పద్ధతులవల్ల వారు దేశాన్ని దొంగచాటుగా హత్యచేసినవారవుతారు. యజమానులు హేతువాదాన్ని తిరస్కరించి దేశభక్తిని తృణీకరించి కార్మికులకు నష్టం కల్గించితే సమ్మెకు కారకులు వారే అవుతారు. తమ యూనియనులను తమ సంఘాలను అవసరమైతే ఖందేష్‌లోని యావత్ కార్మికులు సమ్మె చేసి అయినా రక్షించుకోడానికి సిద్ధంగా వున్నారు. ఖందేష్‌లోని దేశ భక్తులందరూ మమ్మల్ని సపోర్టు చేస్తారని ఆశించుతున్నాం.

ఈ ఉత్తేజకరమైన ఉపన్యాసా నంతరం తీర్మానాలతో సభ ముగిసింది అనేకమంది ఉపన్యసించారు. మహాసభ సూచించిన పోకడను కార్మికులు హర్షించారు.

అమాల్నర్ విద్యార్థి సంఘం ప్రదర్శించిన సోవియట్ ప్రదర్శనాన్ని కార్మికు లందరూ మెచ్చుకున్నారు.

గుజరాత్

గుజరాత్ కార్మికవర్గ ఉద్యమంలో ఒక ఉత్సాహం కన్పించుతోంది. కార్మిక సంఘాలు కొత్తగా రాష్ట్రమంతటా తలయెత్తుచున్నాయి.

గుజరాత్ చరిత్రలో మొట్ట మొదటిసారిగా యావత్ గుజరాత్ కార్మిక మహా సభ అహమ్మదాబాదులో జరిగింది. దానికి 13 కార్మిక సంఘాలనుండి ప్రతినిధులు వచ్చారు. బరోడా, గుజరాత్, కాలోల్, బరోచ్ మొదలుకొని అహమ్మదాబాదు వరకు రాష్ట్రంలో అన్ని ప్రాంతాలనుండీ ప్రతినిధులు వచ్చారు. గాంధిగారి సంస్కరణా (రిఫార్మిస్టు) వాదంతో మునిగి తేలుతున్నా అహమ్మదాబాద్‌లో కమ్యూనిస్టులు పెంపొందించిన "మిల్ కాకుదార్ యూనియన్"నుండి కూడా ప్రతినిధులు వచ్చారు.

ఇది స్వతంత్ర యుద్ధ మనుట; జపాను దురాక్రమణదారుల నుండి మాతృ దేశాన్ని రక్షించుకొనుటలో యావత్ గుజరాతు కార్మికులు పాల్గొంటామని ప్రతినబూనుట; జాతీయ ప్రభుత్వాన్ని కోరుట; దేశంలోని వివిధ జాతులకు స్వయం నిర్ణయ సూత్రాన్ని అంగీకరించుటద్వారా హిందూ - ముస్లిం ఐక్యతను ఏర్పరచుట; మొదలగు తీర్మానాలపై తీవ్రమైన చర్చలు జరిగాయి. మరికొన్ని తీర్మానాలలో ప్రభుత్వ నిర్బంధ విధానాన్ని ఖండించారు. ఫాసిస్టు వ్యతిరేక రాజకీయ ఖైదీలను, దేశభక్తులను విడిచిపెట్టాలని ముఖ్యంగా గుజరాతు జైళ్ళలో మ్రగ్గుచున్న రణచోడ్ పటేలు, భోగీలాల్ గాంధీ, హరిప్రసాద్ దేశాయి, మొదలగువారిని విడిచిపెట్టాలని కోరారు.

గుజరాతు కార్మికుల కోర్కెలను గురించి వివరంగా ఒక తీర్మానం చేయబడింది. అహమ్మదాబాదులో కార్మికసంఘము యజమానుల సంఘమూ వచ్చిన ఒడంబడికకు వ్యతిరేకంగా నేత డిపార్టుమెంటులో 100 కి 25 చొ॥ జీతాలు తగ్గించారు. దానిని రద్దుచేసికోవాలని, మిల్లుకమిటీలను కార్మికు లేర్పరచుకోవాలని, కార్మికుల న్యాయ హక్కులను అంగీకరించేటట్లు ప్రభుత్వం యజమానులపై ఒత్తిడి తేవాలని, యజమానుల దురాశవలన పై ఉత్పత్తికి నష్టం కలిగేట్టు చేయరాదనీ యీ తీర్మాన సారాంశం. ఇంకా 100 కి 25 చొప్పున జీతాలు హెచ్చించాలనీ చౌక ధాన్యపు కొట్లు తెరవాలనీ కోరుతూ తీర్మానాలు గావించబడినాయి.

విమానదాడి సమయాలలో కార్మికులు పారిపోరాదని, తమ పనిని యథాప్రకారం సాగించుతూ వుండాలని కోరుతూ ఒక ముఖ్య తీర్మానం గావించబడింది, కాని యిలా చేయాలంటే కార్మికులకు తగిన రక్షణ అనగా - ట్రెంచెస్ (గోతులు) షెల్టర్సు (తలదాచుకొనే స్థలాలు) నిర్మించాలి. పూర్తి విమానదాడి రక్షణ వసతులు కల్పించాలి. తమ కుటుంబాలను ఇండ్లకు తీసుకుపోడానికి $1\frac{1}{2}$ నెలల జీతం, 15 రోజుల సెలవు యివ్వాలి.

మ్యునిసిపల్ కార్మికులకు, బీడీ కార్మికులకు, రైల్వే కార్మికులకు సంబంధించిన తీర్మానాలు కూడా ప్యాసయినాయి.

గుజరాత్ రాష్ట్ర ట్రేడ్ యూనియను కాంగ్రెసును నిర్మించడానికి తీర్మానింపబడింది. ఇలాంటిది యిదివరకు లేదు. ప్రతినిధులను పంపిన సంఘాలన్నిటికి ప్రాతినిధ్యం వహించిన 15 గురుతో ఒకకమిటీ యేర్పరచబడింది. అహమ్మదాబాదు కార్మిక నాయకులగు జి. యం. ఖాన్, కామ్రేడ్ జుగ్గన్‌ఖాన్ అధ్యక్ష కార్య దర్శులుగా యెన్నికోబడినారు. వీరు పైన చెప్పిన రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు స్థాపనకు పూనుకుంటారు.

బహిరంగ సమావేశానికి నాల్గయిదువేల మంది హాజరయ్యారు రైతునాయకుడు సహా

సర్వశక్తులా ప్రయత్నించండి !

సెప్టెంబరు 1 వ తేదికి రు. 30,000 కావాలి !

కామ్రేడ్ పి. సి. జోషీ

ప్రియమైన మన మాతృభూమి జపాన్ ఫేసిస్టులచే బానిసగా చేయబడే ప్రమాద మేర్పడింది. ఇలాంటి ప్రమాదం మన దేశానికెన్నడూ సంభవించలేదు.

జాతీయనాయకత్వము ప్రజలు యీ ప్రమాదాన్నెదుర్కొవడానికి, సమాయత్తపర్చడానికి బదులు నిస్తబ్ధతలో కూర్చుంది. మన దేశ స్వాతంత్ర్యాన్ని సంపాదించడానికి, శత్రువును జయప్రదంగా యెదుర్కొనడానికి అందు కవసరమైన జాతీయైక్యతను సంపాదించ గల్గడానికి తగిన స్పష్టమైన కార్యక్రమాన్ని కమ్యూనిస్టులు తప్ప మరే యితరరాజకీయ పార్టీ యివ్వడంలేదు. మన పాలసీని చాలమంది యింకా అంగీకరించలేదు. మనం యింకా కొంతకాలం ఒంటరిగానే పని సాగించాల్సి వుటుంది. ఇప్పుడు మన పంథా యొక్కటే సరియైన దగుటచే తప్పక దేశమంతా యింక కొంతకాలానికి అనుసరించి తీరుతారు. మన పాలసీ సరియైనంత మాత్రానే చాలదు. మన పాలసీ ప్రజలు తెలుసుకోవాలి. అన్నికష్టాల నెదుర్కొంటూ, మనం దేశాన్నంతా మన పంథాకు గొనిరావాలి. దేశభక్తులందరికి మన పాలసీని తెలియజెప్పడానికి, పూర్వపు మన యోధులకు తగినట్లుగా ధైర్యంతో మన దేశాన్ని రక్షించడానికి వారి నందరిని ఉత్తేజపర్చడానికి మన పత్రిక "పీపుల్సువారు" పనిజేస్తుంది.

"పీపుల్సువారు"ను నిరాటంకంగా నడపడానికి సెప్టెంబరు 1 వ తేదీలోపల రు 30,000 ల ఫండు కావాలి. ఇప్పుడు చేతికి చేరినది రు 5000/- లు మాత్రమే. యింకా మూడు వేలు కాగితం కొనడానికిగాను పెట్టుబడి పెట్టాము. కాగితం, ముద్రణ ఖర్చులు, వేతనాలు, అద్దెలు మాత్రమే నెలకు రు 5000/- లు అవుతాయి. ఇప్పుడు గ్యారంటీగా నెలకు వెయ్యి రూపాయలు మాత్రమే విరాళాలు వస్తాయి.

పేపరు నిల్వ చేసుకోవాలి; పేపరు ధర యుద్ధానికి పూర్వపు ధరలకన్నా మూడు రెట్లు పెరిగింది. ముద్రణ రేట్లు గూడ చాల పెరిగిపోతాయి. అందుచేత స్వంత ప్రెస్సు పెట్టుకోవలసివుంది. రు 30,000 ఫండు వసూలైనా 4 నెలలకు మాత్రమే పత్రిక నడపడానికి వస్తుంది. అయినా యీలోపుగా పత్రికకు విరివిగా చందాదార్లను జేర్పించి, విడి అమ్మకాలను స్థిరపర్చి, తప్పనిసరిగా ప్రతినెలా విరాళాలిచ్చే వారిని సంపాదించి నెలకయ్యే ఖర్చుకు సరిపోయే ఆదాయాన్ని గడించగలమని ఆసిస్తున్నాము. పత్రికను సాగించడానికి మాత్రమే యీ ఫండు వుద్దేశింప బడింది.

ఇంత ఫండు కావాలని యెన్నడూ మేము కోరలేదు. దేశస్వాతంత్ర పోరాటాన్ని, జీవిత పోరాటాన్ని సాగించడానికి యీ ఫండు ప్రోగుచేస్తున్నామని గుర్తించితే, యిది యెంత పెద్ద మొత్తమైనా తప్పక వసూలు చేయగలుగుతారు. కామ్రేడ్సు: అందుకు మీరు పూనుకుంటే మీకు శక్తివుంది. 15 సంవత్సరాల నుండి భారత దేశ కమ్యూనిస్టులు దేశానికి సేవ చేస్తున్నారు. ఈ కాలములో యెప్పుడు యే సహాయము కావాలన్నా మన సానుభూతిపరులు వెనుదీయలేదు. ఇప్పుడూ గూడా వెనుదీయరు. వృధా వాగ్వివాదాలు మానండి; కార్యాచరణకుదిగండి.

కమ్యూనిస్టులు ఇతరులకు బోధించడమే గాక, తాము స్వయంగా ఆచరించుతారు. ప్రజలకు మనప్రేమ, సాను భూతులేమైనా యేర్పడినవంటే, మనం చెప్పినదేదో తూ చా తప్పక ఆచరించుతూ వుండడం వలననే; రు 30,000 ఫండు పూర్తిగా పోగు చెయ్యాలంటే, ప్రతి కమ్యూనిస్టు పూర్తిత్యాగాన్ని కనపర్చి యితరులకు ఆదర్శంగా వుండాలని కమ్యూనిస్టు నాయకత్వం హెచ్చరిస్తోంది. ముఖ్య కామ్రేడ్సు అందరూ తమ సర్వస్వాన్ని త్యాగం చెస్తారని ఆశిస్తున్నాము. ప్రతి కామ్రేడ్ తనకు సాధ్యమైనంత వరకు త్యాగం చెయ్యాలని కోరుచున్నాము. ఇంతకు ముందు యిచ్చిన దానికన్నా హెచ్చుగా విరాళాలివ్వాలని మాసానుభూతి పరులకు విజ్ఞప్తి చేస్తున్నాము

కార్మిక కామ్రేడ్సు :- మీ అంతట మీరు ఒక వారంలో గడించే జీతాన్ని పార్టీ ఫండుకు యివ్వండి: ప్రతి కార్మిక సాను భూతి పరునుండి అణా మొదలు 4 అణాల వరకు విరాళాలు వసూలు చేయండి.

ఉద్యోగాలల్లోవున్న కామ్రేడ్సు :- ఒక నెల జీతం పార్టీ ఫండు కివ్వండి. మీస్నేహితులు, సానుభూతి పరులనుండి విరాళాలు వసూలు చేయండి.

కామ్రేడ్స్ : యీమర్చర పరిస్థితులోమీరు పడుచున్న కష్టాలేమో మాకు తెలుసు యీ సమయములో మీపై వేస్తున్న యీభారమెట్టిదోమాకుతెలుసు. అయినప్పటికి నిరుత్సాహపడవద్దు. దేశస్వాతంత్ర్యము నూతన సమాజ నిర్మాణము కొరకూ యీ భారం మోస్తున్నామనే చైతన్యంతో విరాళాలివ్వండి.

ఆంధ్ర పంజాబ్ కిసాన్ కామ్రేడ్సు : మీకందరికీ మీస్వంత భూములున్నాయి : మొత్తాన్నంతటినీ గాని కొంత భాగాన్ని గాని అమ్మివేయండి. ఆచరణలో మీకు వచ్చే ఆటంకాలు లేకపోలేదు. కాని బోల్షివికులుగానే వాటిని యెదుర్కొండి భూమిని అమ్మజాలకపోతే, తాకట్టుపెట్టండి. మాతృభూమిని నిలబెట్టడానికి, స్వాతంత్ర్యమును గడించడానికి మీ భూములను త్యాగము చేసేభారం మీకు లభిస్తుంది.

కామ్రేడ్సు : మీ భార్యలను, అక్కచెల్లెండ్రను, మాతలను వారినగలను అమ్మి పార్టీ ఫండుకు విరాళ మిచ్చేటట్లు వుత్తేజపర్చండి. స్త్రీజాతి గౌరవాన్ని నిలబెట్టడానికే యీ ఫండు వినియోగింప బడుతుందని వార్కినచ్చ జెప్పండి.

స్థానిక కామ్రేడ్ నాయకులారా; పైకమిటీల సర్క్యులర్ల కొరకు యెదురు చూడక మీరు వసూలుచేయగల్గినంత యిప్పటినుండే వసూలు జేయడం ప్రారంభించండి. ఇది ప్రధమ కర్తవ్యముగాయెంచండి. సోషలిష్టుపోటీపడండి.

ప్రతి వారం మనిఆర్డర్లు పంపాలి. డొఖం వెంటనే కావలసివుంది, విరాళా లిచ్చినవార్కివేరుగా గాని, విరాళము వసూలు చేసిన కామ్రేడ్సు ద్వారా గాని ఆఫీసు నుండి పక్కా రశీదులు పంపబడుతాయి. మారు పేరుతో రశీదులు కావాలన్న వారు, అట్టిపేర్లు పంపాలి. విరాళ మిచ్చినఅందరికి రశీదులు చేరాలి.

పెరంబూర్

ఎం. ఎస్. ఎం. రైల్వే పనివారల సంఘం పెరంబూరు బ్రాంచి ఆధ్వర్యాన 15-7-42 వ తేదీన పెరంబూరులో బహిరంగసభ జరిగింది. ఆర్. కుప్పుస్వామి నాయకరుగారు అధ్యక్షత వహించారు. సభకు 2000 మంది పనివారు హాజరయ్యారు. ఈ మధ్యనే విడుదలైన మద్రాసు కమ్యూనిస్టు కేసులో ఒకరైన పి. రామమూర్తిగారు సభకు ఆహ్వానింపబడ్డారు. సోమసుందరం, ఎస్. ఎ. మహాలింగం, పద్మనాభన్, జంబులింగంగార్లు ఉపన్యసించారు. ఈ క్రింది తీర్మానాలు గానించబడ్డాయి.

(1) కొద్ది జీతాలు తీయు ఆర్టిజాన్లకు 10 సం॥నుంచి ఒక గ్రేడ్ నుంచి మరియొక గ్రేడ్‌కు ప్రమోషన్లు ఆపి వుంచినందుకు కంపెనీవారిని నిరశిస్తూ వెంటనే అట్టి ప్రమోషన్లు అమలు జరుపమని కోరడమైనది.

(2) వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయినందున తగినంత యుద్ధ అలవెన్సు అధికంగా యివ్వాలని రైల్వే బోర్డును కోరుతు యీ విషయమై సంప్రదింపులు జరుపుటకు ఎస్. గురుస్వామి, ఎ. ఎల్. నారాయణస్వామి, ఎం. జె. వీరరాఘవులు నాయుడు, ఆర్. కుప్పుస్వామిగార్లలో కూడిన డిప్యుటేషను యేర్పాటు చేయడమైనది.

(8 వ పేజీ తరువాయి)

నం: ఇలా ఉపన్యసించాడు. 11 జపానువాళ్ళ బాంబులు దీదరైన మన ఇండ్లను నాశనం చేస్తాయి. దోపిడిగాండ్రు వచ్చి మనను దోపిడి చేస్తుంటే "మాకు స్వాతంత్ర్యం వచ్చేదాకా మేము మమ్మల్ని రక్షించుకోము" అని అనడం జపానువాళ్ళు అతి నీచమైన దోపిడిగాండ్రు. ఫేసిజానికి వ్యతిరేకంగా సాగించే పోరాటం నేడు మన స్వాతంత్ర్యపోరాటం కూడా."

తర్వాత సయ్యద్ జహీరు ఉపన్యసించాడు. ధరలకు తగినట్లుగా వేతనాలు పెరగలేదనీ, కార్మికులస్థితి - ముఖ్యంగా అహమ్మదాబాదులో అధ్వాన్నంగా వుందని చెప్పాడు. ప్రభుత్వం కార్మికులకు న్యాయం కలిగేటట్లు చూడితీరాలన్నాడు. "కార్మికులు హిందూదేశం స్వతంత్రం పొందడానికి గాను కష్టపడాలి. పోరాడాలి. వా రితరప్రజల సహకారంతో జాతీయైక్యతను జాతీయ ప్రభుత్వాన్ని పొందాలి. జపానువాళ్ళను ఎంతకష్టనష్టాలకు గురియైనా ఎదుర్కొనాలి. ఇది మన జన్మభూమి. లిన్లిత్ గోదిగాని, రోగర్‌లూమ్లేదిగాని, మాక్స్‌వెల్ దిగానికాదు. స్వతంత్ర ప్రియులై ప్రపంచ ప్రజలతో గలసి, దానిని రక్షించుకోవలసిన దానికి విముక్తి గల్గించవలసిన బాధ్యత మనది."

ఖమ్మం కళాసుల సమ్మె

9—7—42 తేదీని ప్రభుత్వంవారు మార్కెట్టు ఆక్టు ప్రకారం కొలత తీసివేసి తూకం పద్ధతి అమలులో పెట్టారు. దీనిపై అసమ్మతి తెలుపుతూ ఖమ్మం ఫ్యాక్టరీలలోని 500 మంది కళాసులు సమ్మె జేశారు. సమ్మె రెండవ రోజున పోలీసులు వచ్చి బెదిరించారు. కాని కళాసులు భయపడలేదు. మూడవ రోజున కళాసులంతా కలెక్టరుగారి వద్దకు వెళ్ళి తమ కోర్కెలు తెలియ జేసుకున్నారు. కలెక్టరుగారు కళాసుల ఇబ్బందులన్నీ తొలగించుతామని వాగ్దానం చేసిన మీదట కళాసులు సమ్మె ముగించి పనిలోనికి వెళ్ళారు.

కళాసుల కోరికలు

(1) కొత్తగా పెట్టిన తూకం పద్ధతి పోవాలి.

(2) పూర్వం ఇస్తూన్న కూలికంటె 33⅓% యెక్కువ వేతనం ఇవ్వాలి.

(3) షాహుకార్ల యిండ్లవద్ద ఉచితంగా చాకిరీ చేయించుకోడం మానాలి.

(4) కూలీ సంఘాల్ని గుర్తించాలి.

తహసిల్‌దారు దౌష్ట్యం

ది 12—7—42 తేదీని కాచిరాజు గూడెం కాపురస్తులైన కొమరగిరి నారాయణరావు, పబ్బరాజు రాజేశ్వరరావు అనే రైతులు, తక్కావి విత్తనములు అప్పు తీసుకో డానికి నియమిత ఫారం మీద గ్రామాధికారిచే నమోజు చేయించుకొని ఖమ్మం తహశ్శీల్‌దారుగారివద్దకు దరఖాస్తులు దాఖలుచేయడానికి వెళ్లారు. ఆయన దానికి సంబంధించిన గుమాస్తాను దరఖాస్తులు పరిశీలించమని వారివద్దకు పంపారు. ఆగుమాస్తాగారు దరఖాస్తు చూడకుండా సాయంకాలం వరకూ రైతులను ఆలాగే నిలువబెట్టి వుంచాడు. ఇంతలో ఆఫీసుటైము అయిపోవచ్చింది. అంతట ఈ రైతులిరువురు తహశ్శీల్‌దారుగారి వద్దకు వెళ్ళి గుమాస్తా చేస్తున్న కాలయాపనను గురించి మనవి చేసుకొని తమ పని పూర్తిచేసి పంపవలసినదిగా కోరినారు. దానిపై తహశ్శీల్‌దారుగారు, మీరు మా ఆఫీసు గుమాస్తాపై షికాయతు (పెత్తనం) చేస్తారా" అని మండిపడి చపరాసీ (బంట్రోతు) పిలిచి వీ రిద్దరిని మెడపట్టి గెంటివేయమని ఆజ్ఞాపించారు. వాడందుకు సిద్ధమయ్యాడు. ఈ అవమానానికిపాల్పడకుండా "ఒక బాధ్యతగల తహశ్శీల్‌దారువంటి తాలూకా ఆఫీసరుగారు రైతుల యెడల ఇలా ప్రవర్తించడం న్యాయంకాదని" చెప్పి ఆ రైతులు వెళ్ళిపోయారు. ఉన్నతాధికారులీవిషయమై తగుచర్య తీసుకుంటారని కోరుతున్నాను.

—ఒకరైతు

ఏజెంట్లకు

ఎక్కువ కాపీలు కావలసినా, తగ్గించవలసి వచ్చినా శనివారం నాటికి ఆఫీసుకు తెలియజేయాలి లేనిచో మార్పుచేయబడదు.

—మేనేజరు

ప్రపంచ యుద్ధసమీక్ష

వొరొనెజ్ వద్ద జర్మన్ల ఉధృతం అరికట్టబడింది. వొరొనెజ్ కు దక్షిణముగా సోవియట్ సైన్యాలు డాన్ నదిని దాటాయి. "మన సైన్యాలు నెమ్మదిగా అయినప్పటికీ దృఢ బుద్ధితో శత్రువును పడమటికి నెట్టుచున్నాయి." అని ప్రవదా పత్రిక వ్రాసింది. జర్మనులు యిచ్చట రక్షణలను నిర్మించుకొన మొదలుపెట్టారు. డాన్ నది తూర్పువొడ్డున నున్న మూడు గ్రామాల నుండి జర్మనులు తరిమివేయబడ్డారు. వొరొనెజ్ జర్మన్ల చేతిలో పడకపోయినా మాస్కో-వొరొనెజ్-రోస్టోవ్ రైల్వే లైనులోని కొన్ని ప్రదేశాలను ఛేదించగలిగారు. ఈ రైల్వే లైను పైననే వున్న మిల్లిరోవో ను మన సోవియటు సైన్యాలు ఖాళీ చేశాయి. ఇది రోస్టోవ్ కు 130 మైళ్ళ దూరములో ఉత్తరంగావుంది. ఇక్కడనుండి దక్షిణంగా జర్మన్ సైన్యాలు కదులుతున్నాయి. పైన చెప్పిన రైలు మార్గంలోనే మిల్లిరోవో కు, రోస్టోవ్ కు మధ్య కామెన్స్క అనే పట్టణం వుంది. దానివైపుకు జర్మను సైన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. మన సోవియటు సైన్యాలు యిచ్చట ఆత్మ రక్షణ యుద్ధాలను గావించుచున్నాయి. ఈ రైలు మార్గానికి పశ్చిమం నుండి వచ్చి కలసిన మరొక రైలు మార్గంలో లిసిచాన్స్క-వొరోషిలావ్‌గ్రాడు లున్నాయి. ఈ రెండింటినీ మన సోవియటు సైన్యాలు ఖాళీ చేశాయి. లిసిచాన్స్క నుండి జర్మను సైన్యాలు తూర్పుగా పోతున్నవి. జర్మను సైన్యాల ఆశయం అటు స్టాలిన్‌గ్రాడ్ ను, ఇటు రోస్టోవ్‌లను స్వాధీనం చేసికొనడం. మిల్లిరోవ్ ప్రాంతాలజరిగే యుద్ధం ప్రమాదకరంగానే వున్నదని 'రెడ్ స్టార్' పత్రిక వ్రాసింది. రెడ్ స్టార్ యిలా వ్రాసింది. "మిల్లిరోవో ప్రాంతంలో జర్మనులు ఒక అనుకూలమైన స్థానాన్ని (బేస్) పొందగల్గారు. దానినుండి మన యావత్తు దక్షిణ రంగానికి ప్రమాదం కలిగించవచ్చు. వారి స్ట్రాటజిక్ ప్లానులు (యుద్ధవ్యూహాలు) జయం పొందితే మన దేశానికి అపాయం పది రెట్లు పెరుగుతుంది."

'రెడ్ స్టార్' పత్రికకు యుద్ధరంగం నుండి వచ్చిన వార్త ఇలా చెబుతుంది. "జర్మనులు యింకా క్రొత్త క్రొత్త సైన్యాలు మొదలయినవి ప్రోగు చేస్తున్నారు. మన రక్షణలలో బలహీన స్థానాలేమిటా యని వెదుకుతున్నారు. చొచ్చుకుపోవ ప్రయత్నించు తున్నారు. వెనుక భాగంనుండి దెబ్బగొట్ట ప్రయత్నిస్తున్నారు. అధిక సంఖ్యా బలమున్నా మనం మొండిగా ప్రతిఘటించడం వలన పై ప్రయత్నం ఫలించ లేదు. జర్మనులు యిక్కడ పెద్ద సైన్యాన్ని అట్టిపెట్టారు. మంచి బలమైన రక్షణతోను మన సేనల యొక్క శక్తివంతమైన తిరుగు దెబ్బలతో మాత్రమే శత్రువు పురోగమనాన్ని ఆపగలము."

తిరోగమన మెందుకు?

సోవియటు సైన్యాలు యిపుడు శత్రువులకు విపరీత నష్టాలు కల్గించే యుద్ధం జేస్తూ యెందుకు తిరోగమనం జేస్తున్నాయి?

జర్మనీ శీతాకాలం రాక మునుపే కాకేసియా నూనె గనులను ఆక్రమించుకోవాలని, రష్యన్ సేనలను పూర్తిగా నాశనం చేయాలని ఉద్దేశించు తున్నది. అందుచే యెంతమంది సైనికులు నాశనమవుతున్నా, యెంత యుద్ధ సంపత్తు నష్టమవుతున్నా లక్ష్యం చేయక కొన్ని కొన్ని ప్రదేశాలలో యెక్కువ బలాన్ని కేంద్రీకరించి, జర్మనీ ముందుకు నెట్టుకు వస్తూవుంది. సోవియటు నాయకులు అనవసరంగా తమ సైన్యాలను బలి యివ్వ దలచుకోలేదు. తమ విజయానికి ముఖ్య కీలక ప్రాంతాలను తప్పితే, మిగిలిన ప్రదేశాన్ని వదులుకోడానికి తయారవుతున్నారు. అంతేగాని అప్రధాన ప్రదేశాన్ని రక్షించుకోడానికి తమ సైనికులను బలి యివ్వరు. అనవసర ప్రాణ నష్టానికి సోవియటు నాయకులు తయారు గారు. అట్టి కీలక స్థానం స్టాలిన్‌గ్రాడు ఇంకా స్టాలిన్‌గ్రాడు - రోస్టోవ్ ల మధ్య నున్న రక్షణ శ్రేణులు. ఈ శ్రేణులను జర్మన్లు ఆక్రమించితే కాకేసియా పై దాడి సులభమౌతుంది. కాకేసియా నూనె గనులు సోవియటు విజయానికి మరియొక కీలక స్థానం. వీటిని సోవియటు తప్పక రక్షించి తీరుతుంది.

స్టాలిన్‌గ్రాడు వైపుకు జర్మనులు పురోగమించుటలో ఉద్దేశ్యం యిది, స్టాలిన్‌గ్రాడ్ వరకూ పోయి కాకస్ పైకి మరలి రావాలనీ వారి ఎత్తు. అలా మరలినపుడు, ఉత్తర దిక్కు నుండి సోవియటు సైన్యాలు తన (జర్మనీ) పురోగమనాన్ని ఛేదించకుండా ఉండడానికి గాను కావలసినంత ప్రదేశాన్ని ఆక్రమించడం జర్మనీ వుద్దేశం. అందుకే యీ పురోగమనం ప్రారంభమయింది.

సోవియటు తిరోగమనాలను జూచి కొందరు గాభరా పడుతున్నారు. కాని సోవియటు పత్రికలకు విజయంలో దృఢ విశ్వాసం యే మాత్రం తగ్గలేదు. సోవియటు సకాలంలో శత్రువును ఆపగలదా? జర్మన్ల ప్లానులను తల్లక్రిందులు చేయగలదా? ఈ ప్రశ్నలకు అవును అని సోవియటు పత్రికలు దృఢ విశ్వాసంతో జవాబు చెప్పుతున్నాయి. ఇంతేగాక సోవియటు విషయ మెరిగిన వా రందరూ అదే చెప్పుతున్నారు. సోవియటు రష్యాపై అనేక గ్రంధాలు వ్రాసిన సుప్రసిద్ధ రచయిత మారిస్ హిండస్ యిలా అంటున్నాడు. "రష్యాలో అపజయ భయం లేదు. కొంత భూభాగం నష్టపడటం రష్యన్లను కలత పెట్టడం లేదు. ఎందువల్లనంటే శత్రువు జయించిన ప్రదేశానికి తగినట్లుగా అధికంగా నష్టపడుతున్నాడు. ఒక సోవియటు రచయిత యిలా అన్నాడు. 'రష్యన్ యుద్ధాలలో శత్రు సైన్యాల గోరీలను కట్టే స్మశానముగా ఉంటున్నన్నాళ్ళూ, కొంత ప్రదేశాన్ని మేము పోగొట్టు కొనడంవల్ల మాకు నష్టం లేదు.' రష్యా శత్రువును అలసిపోయేటట్టు చేసి, దుంప తెంచి, ఓడించడానికి సమయంకోసం నిరీక్షించు తున్నది."

ఇదివరకు సోవియటుకు అమెరికన్ రాయబారిగా నున్న జోసెఫ్ డేవిస్ యిలా వ్రాశాడు. "రష్యా సంగతి తెలిసిన నేను 1941 లో రష్యాను దెబ్బ గొట్టలేకపోయిన జర్మనీ, 1942 లో దెబ్బ గొట్టుతుందని భావించలేను."

రెండవ రంగం

ఇలా అని జర్మనీ ధాటినంతనూ సోవియటే భరించాలని అర్థం కాదు. న్యూస్ క్రానికల్ చెప్పినట్లు "ఊరికే రొమ్ములు బాదుకోడానికి యిది సమయం కాదు. రష్యా అగ్నిపరీక్ష నూతన ఆలోచనకూ నూతన ప్రయత్నానికే దారి తీయాలి."

అంతేగాని బ్రిటిషు ఉత్పత్తి మంత్రి ఆలివర్ లిటిల్‌టన్ లాగా చేతులు జార విడిచి కూర్చోరాదు. అతనిలా అన్నాడు. "మనం చేయగల్గిన సహాయమంతా రష్యాకు చేశాం, ఇపుడు రష్యా పై దెబ్బ పడింది. ఈ అమృతమైన దాడిని వీరోచితంగా యెదుర్కొంటున్న రష్యన్ల ప్రతిఘటనను హర్షించుతూ చూడగలమే గాని యేమీ చేయలేము."

దీని అర్థం బ్రిటిషు ప్రజల ప్రపంచ ప్రజల ఒత్తిడిని భరించలేక, రెండవ రంగాన్ని తెరుస్తామని చర్చిల్, రూజ్‌వెల్టులు వాగ్దానం చేశారు. కాని తెరవడానికి వెనుకంజ వేస్తున్నారు అనియే. ఈ సంవత్సరంలో సోవియటు కమ్యూనిస్టు (బోల్షివిక్ పార్టీ) సెంట్రల్ కమిటీ సభ్యుడగు కామ్రేడ్ అలెగ్జాండ్రొవ్ సంయుక్త యుద్ధ వ్యూహం కావాలని కోరినట్లు రాయిటర్ విలేఖరి తెలియజేశాడు. అలగ్జాండ్రొవ్, యూరప్‌లో రెండవ రంగాన్ని స్థాపించాలని కోరాడు. ఇతర యునైటెడ్ నేషన్సు సైన్యాలకు రెడ్ఆర్మీ సైన్యాలకు సంయుక్తవ్యూహం కావాలని అన్నాడు. తగిన తెలివి తేటలనుపయోగించి మిత్రమండలి సంపదలను (రిసోర్సెస్) అవకాశాలను ఉపయోగించాలని అతడన్నాడు. అలగ్జాండ్రొవ్ వంటి బాధ్యత గల సోవియటు నాయకుడు హెచ్చరించడమే గాదు, ప్రపంచ ప్రజ లందరు యిదే కోరుతున్నారు. ఉదాహరణకు అమెరికన్ ప్రజల అభిప్రాయం యిలా ఉన్నదని అచటి విలేఖరి యిలా వ్రాస్తున్నాడు. "డాన్ లోయలోని బ్రహ్మాండమైన యుద్ధాన్ని చాల జాగ్రత్తగా పరిశీలించు తున్నారు. అమెరికన్‌ల వైఖరిని యీ క్రింది మాటల్లో క్లుప్తపరచవచ్చు. 'రెండవ రంగం కల్పించడానికి సమయం వచ్చినది."

జకోస్లోవేకియా మాజీ ప్రధాని బెనిస్ కూడ యిదే అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. ప్రపంచ ప్రజల ఒత్తిడి వలన యిపుడు వెనుకంజ వేసినా, రెండవ రంగాన్ని స్థాపించడానికి బ్రిటను, అమెరికాలు పూనుకొనక తప్పదు. రెండవ రంగం యేర్పడకముందే జర్మనీ చొచ్చుకుపోవాలని ప్రయత్నం. సోవియటులో దాని ప్రయత్నం వివరించాం. ఇక ఈజిప్టు చూద్దాం.

ఈజిప్టు రంగం

ఈజిప్టులో చెప్పదగిన మార్పులు లేవు. స్థానిక పోరాటాలలో రోమెల్ దాడి ప్రయత్నాలను మన సైన్యాలు ప్రతిఘటించాయి. ఇంకా ఎల్ అలామిన్ వద్దనే ఇరు పక్షాలు నిలచి పోయాయి.

చైనా రంగం

ఇక దూర ప్రాచ్య విషయం చూద్దాం. జపాను చైనా తూర్పు రాష్ట్రాలలోని రైల్వేలను పట్టుకోవాలని ప్రయత్నం చేస్తున్నది. అందుకుగాను కాంటన్-హాంకో రైల్వే మార్గాన్నేగాక హాంగ్‌చౌ నాన్‌చాంగ్ రైలు మార్గంమీద ఈవారం కేంద్రీకరించింది. ఈ తూర్పు రాష్ట్రాలను జపాను జయించడం వల్ల జపానుపై మిత్రమండలి దెబ్బతీసే స్థానాలు(బేసెస్) పోతాయి. అందుకే యింత ప్రయత్నం చేస్తున్నది. కాని విఫలం జెందుతూవుంది. రష్యాను చైనాతో కలిపే రోడ్డును కూడ తెగగొట్టాలని పశ్చిమ సుయియాన్ రాష్ట్రంలో జపాను చేసిన ప్రయత్నం కూడ విఫల మయింది. 21-7-42

Edited and Published by Katragadda Rajagopala Rao and Printed by The Popular Printers, Bezwada.

END OF ISSUE